S TV SAMAYAM

www.epapersamayam.com

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 18 | సంచిక: 322 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 2 ఆగస్టు 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం

### సీఎం శర్మతో తితిదే ఛైర్మన్ భేటీ

**తిరుమల :** అస్సాం రాజధాని గౌహతిలో శ్రీవారి ఆలయం నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానంచర్యలు చేపట్టింది. ఈ మేరకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మతో తితిదే ఛైర్మన్

మిగతా 2 లో

# యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం



- మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం
- 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం
- మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తితో కాంతులు

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది. దీంతో విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రభుత్వం జాతికి అంకితం చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి రెండవ యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తితో కాంతులు విరజిమ్ముతున్నాయి.

**నల్లగొండ, ఆగస్ట్ 1:** నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అంకితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు.

మిగతా 2 లో




ఉపరాష్ట్రపతి ఎన్నికకు

## షెడ్యూల్ విడుదల

- 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ
- నామినేషన్లు దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ
- సెప్టెంబర్ 9న ఎన్నిక.. అదేరోజు ఫలితం ప్రకటన

ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి.

04




రేవంత్, కేటీఆర్, జగదీష్‌రెడ్డికి

## హైకోర్టులో ఊరట

02

- కేసులను కొట్టివేసిన ఉన్నత న్యాయ స్థానం



## జాతీయ ఉత్తమ చలనచిత్ర అవార్డుల ప్రకటన

ఉత్తమ చిత్రంగా '12 త్ ఫెయిల్'కి అవార్డు

ఉత్తమ నటులుగా షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే

- ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ
- ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి
- బలగం పాటకు ఉత్తమ గేయరచయిత అవార్డు

సినిమా పేజీలో



## జగన్‌ను ఆపటం మీ తరంకాదు

హోం మంత్రి శాంతిభద్రతలు చూసుకోవాలి

విమర్శలు చేస్తూ కూర్చుంటే ఎలా

మాజీమంత్రి, వైకాపా నేత అంబటి విమర్శలు

**అమరావతి :** చిట్టి నాయుడు దెబ్బకు చంద్రబాబు బుర్ర కూడా పోయిందన్నారు.. జగన్ ను ఆపటం మీ తరం కాదు.. జగన్ వస్తే విపరీతంగా జనం వస్తున్నారని మీరే ప్రచారం చేస్తున్నారు.. లా అండ్ ఆర్డర్ చూసుకోవాల్సిన హోం మంత్రి ఆ పని చేయటం లేదు.. హోం మంత్రి

మిగతా 5 లో

దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్నది

# మన రాష్ట్రమే

గూడెం చెరువులో పెన్షన్లు అందచేసిన సీఎం చంద్రబాబు



- రూ.3,800 కోట్లతో హంద్రీనీవా పనులు
- లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు
- త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు
- 2028 నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పూర్తి

**కడప :** హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆలోచన నుంచే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం లోని గూడెం చెరువులో చేనేత కార్మికురాలు అలివేలమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు సీఎం పింఛను అందజేశారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక వరకు సీఎం ఆటోలో వెళ్లారు. అక్కడ నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడారు. రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టామని, త్వరలోనే హంద్రీనీవా పనులు పూర్తి చేసి చెరువులన్నీ నింపుతాం అని తెలియజేశారు. సముద్రంలోకి వెళ్లే

మిగతా 5 లో

ఎన్నికల అక్రమాలపై అణుబాంబు లాంటి

## ఆధారాలు

ఈసీపై విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



.. వివరాలు 2లో

రాహుల్‌ది భారత్

## వ్యతిరేక భాష

ఎవరిమెప్పుకోసం ఈ విపరీత వ్యాఖ్యలు

రాహుల్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



.. వివరాలు 2లో



# సీఎం రేవంత్‌కు కాళేశ్వరం నివేదిక

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం కమిషన్ నివేదిక అందింది. శుక్రవారం దీనిని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆయన అందజేశారు. శుక్రవారం ఆ నివేదిక సీఎంకు చేరింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై వీరంతా చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు- తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయని, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారని, ఆర్థిక అవకతవకలు జరిగాయని.. ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ పేర్కొన్నట్లు సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగింది.. రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్లు- విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

# సీఎం రేవంత్‌పై కేసు కొట్టివేత

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. భాజపా ఫిర్యాదుతో రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. గతేడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో సీఎం ప్రసంగం వల్ల భాజపా పరువుకు భంగం కలిగిందని ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల కోర్టు విచారిస్తున్న ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ జరిపిన హైకోర్టు ఇవాళ ఆదేశాలు జారీ చేసింది.

# కేటీఆర్, జగదీశ్ రెడ్డిపై కేసు కొట్టివేత

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇరువురిపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును న్యాయస్థానం కొట్టేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేశారని తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు కేటీ-ఆర్, జగదీష్ రెడ్డిపై కేసు నమోదు చేశారు పోలీసులు. అయితే తమపై నమోదైన కేసును కొట్టేయాలని కేటీఆర్, జగదీష్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. గత కొన్ని నెలలుగా న్యాయస్థానంలో వాదనలు వినిపించారు ఇరువైపు న్యాయవాదులు. ఇరువైపులా వాదనలు ముగియడంతో గత నెల 11న తీర్పు రిజర్వ్ చేసింది హైకోర్టు. ఫేక్ వీడియోలపై ఎలాంటి ఆధారాలు లేవని తీన్మార్ మల్లన్న దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు ఇవా(శుక్రవారం) కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేటీఆర్, జగదీష్ రెడ్డికి భారీ ఉపశమనం లభించింది.

# నేను ఏ తప్పు చేయలేదు

**పోలీసుల విచారణలో నమ్రత • సృష్టి కేసులో డాక్టర్ నమ్రత కస్టడీ విచారణ**

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలుగు రాష్ట్రాల్లోసంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. సృష్టి కేసు వ్యవహారంలో తొలిరోజు కస్టడీలో భాగంగా డాక్టర్ నమ్రతను పోలీసులు విచారించారు. సుమారు ఐదు గంటలుగా నమ్రతకు గోపాలపురం పోలీసులు ప్రశ్నలు సంధించారు. నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. అయితే.. చైల్డ్ ట్రాఫికింగ్‌పై అడిగిన ప్రశ్నలకు నమ్రత నోరు మెదపడం లేదని సమాచారం. ఎటువంటి తప్పు చేయలేదంటూ సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది. తాను ఎవరినీ బెదిరించలేదని, మోసం చేయలేదని పేర్కొంది. నిజనిజాలు త్వరలోనే బయటపడుతాయని పోలీసులతో నమ్రత చెప్పినట్లు తెలుస్తోంది. నమ్రత ఏజెంట్లు, ఆశా వర్కర్ల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక్కొక్క దంపతుల వద్ద ఎంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ప్రశ్నిస్తున్నారు. విజయవాడ, వైజాగ్, హైదరాబాద్ సృష్టి ఫెర్టిలిటీ బ్రాంచీలపై వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమంది తల్లిదండ్రులకు పిల్లలను సరోగసి పేరుతో విక్రయాలు జరిపారు..? న్యాయవాది వృత్తి పేరుతో కొడుకు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించడంపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్లో నమోదు చేసుకున్న తల్లిదండ్రుల వివరాలపైనా ఆరా తీస్తున్నారు. ఎలాంటి పశ్చాతాపం లేకుండా పిల్లలను దత్తతకు అరేంజ్ చేశామని బహిరంగంగానే నమ్రత చెబుతున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలో ఖైదీగా ఉన్న డాక్టర్ నమ్రతను శుక్రవారం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఐదు రోజులపాటు- నమ్రతను గోపాలపురం పోలీసులు విచారించనున్నారు. నమ్రతపై హ్యూమన్ ట్రాఫికింగ్‌తోపాటు- పలు కేసులు నమోదు అయ్యాయి. పిల్లలు లేని దంపతులను టార్గెట్‌గా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్లో సరోగసి మాటున శిశువుల విక్రయాలు, అలాగే ఇతరుల స్పర్మ్ తో పిల్లలు పుట్టేలా చేశారనే ఆరోపణలపై డాక్టర్ నమ్రతను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

- మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం
- 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం




**నల్లగొండ, ఆగస్ట్ 1:** నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అంకితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. వనమహోత్సవంలో భాగంగా మంత్రులు ఇక్కడ మొక్కలు నాటారు. అనంతరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

# గొర్రెల పథకంలో వెయ్యికోట్లకు పైగా అక్రమాలు

**దర్యాప్తులో గుర్తించిన ఈడీ అధికారులు**



**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైనే అక్రమాలు జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం అమలులో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు అవినీతిపై దృష్టి సారించారు. డబ్బు భారీగా చేతులు మారిన కారణంగా ఇడిరంగంలోకి దిగింది. గత ప్రభుత్వంలోని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీగా ఉన్న జి. కల్యాణ్‌కుమార్, ఇతర లబ్ధిదారులు, మధ్యవర్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనేక ఆధారాలు సేకరించినట్లు ఈడీ అధికారులు ప్రకటించారు. వివిధ ప్రభుత్వ అధికారులకు ముడుపుల రూపంలో అక్రమ చెల్లింపులు జరిగినట్లు- సూచించే పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 200కుపైగా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, డెబిట్ కార్డులు, 31 సెల్‌ఫోన్లు, 20 సిమ్‌కార్డులను సీజ్ చేశారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక కూడా గొర్రెల పంపిణీలో కుంభకోణం జరిగినట్లు- గుర్తించింది. మార్చి 2021తో ముగిసిన కాలానికి సంబంధించిన కాగ్ నిర్వహించిన ఆడిట్‌లో పథకం అమలులో అనేక అవకతవకలు జరిగినట్లు- వెల్లడైంది. లబ్ధిదారుల వివరాలను సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా ఇన్వాయిస్ రికార్డులు అసంపూర్ణంగా ఉండటం, నకిలీ వాహన నంబర్లతో కూడిన ఇన్వాయిస్‌కు చెల్లింపులు చేయడం వంటివి గుర్తించారు. చనిపోయి/???నికిలో లేని వ్యక్తుల పేరుతో కూడా గొర్రెల యూనిట్లను కేటాయించినట్లు- తేలింది. మొత్తం తెలంగాణవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లకుపైగా అక్రమాలు జరిగాయని ఈడీ అంచనా వేసింది. ఈ కుంభకోణంలో ఎవరి పాత్ర ఎంత, ఇంకా ఎంతమంది అక్రమాలకు పాల్పడ్డారనే విషయంపై దర్యాప్తు కొనసాగిస్తోంది.

# రాహుల్‌ది భారత్ వ్యతిరేక భాష

**ఎవరిమెప్పుకోసం ఈ విపరీత వ్యాఖ్యలు**

**కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** రాహుల్ భారత్ వ్యతిరేక భాషను ఉపయోగించి ఎన్నికల సంస్థను కించపరిచారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. దేశ ఆర్థిక స్థితిని 'డెడ్ ఎకానమీ'గా అభివర్ణించడాన్ని ప్రతిపక్ష సభ్యులే వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆయన ఎవరి మెప్పు కోసం ఇలాంటి విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారో తెలియదని అన్నారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని.. దాన్ని రుజువు చేసేందుకు తమ వద్ద అణు బాంబు లాంటి ఆధారాలున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షంలోని నాయకులే రాహుల్ ఉపయోగించిన భాషను వ్యతిరేకిస్తున్నారు. దేశ ఆర్థిక స్థితిని డెడ్ ఎకానమిగా మీరెలా చెప్పగలరని ప్రశ్నిస్తున్నారు. రాహుల్ చిన్న పిల్లాడు కాదని, ప్రతిపక్షనాయకుడి హోదాకు తగ్గట్టుగా వ్యవహరించాలని రిజిజు సూచించారు. అధికారులను బెదిరించడం, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. ఉద్దేశపూర్వకంగా పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడం వల్ల అంతిమంగా ఓడిపోయేది ప్రతిపక్ష ఎంపీలే అని రిజిజు వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్షం సభను పనిచేయనివ్వడం లేదు. ప్రజల సమస్యలను లేవనెత్తలేని ఎంపీలకు అధిక నష్టం జరుగుతుందని అన్నారు. చర్చలు పార్లమెంటరీ నియమాల ప్రకారం జరగాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ ఇద్దరూ స్పష్టం చేశారని రిజిజు అన్నారు.ప్రతిపక్ష నేత దేశానికి హాని కలిగించే ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారని మండిపడ్డారు.

# లంచగొండుల భరతం పట్టండి


**అవినీతి అధికారులపై ఫిర్యాదు చేయండి**

**లంచం అడిగితే సమాచారం ఇవ్వండి**

**గత నెలలోనే 22 కేసులు నమోదు**

**ఏసీబీ అధికారుల వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం హైదరాబాద్‌లో సూచించారు. అవినీతిని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, స్టిక్కర్లు ద్వారా అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసేలా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో అవినీతి అధికారులపై మెరుపు దాడులు చేసినట్లు చెప్పారు. ఆ క్రమంలో 2025 జులై మాసంలో మొత్తం 22 అవినీతి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ జాబితాలో ట్రాప్ చేయడం, లెక్కకు మించిన ఆదాయం కలిగి ఉండడం, క్రిమినల్ మిస్ కండక్ట్ తదితర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రాప్ కేసుల్లో రూ.5.75 లక్షలు, లెక్కకు మించిన ఆదాయం కేసులో రూ.11.5కోట్ల విలువైన ఆస్తులు వెలుగులోకి వచ్చాయన్నారు. అలాగే ఆర్టీఏ, చెక్ పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ తదితర కార్యాలయాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో లెక్కల్లోకి రాని రూ.1.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి జులై మాసం వరకు 148 కేసులు నమోదు చేసినట్లు- తెలిపింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న మొత్తం 145 ప్రభుత్వ ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే మొత్తం రూ.30.32 లక్షలు ట్రాప్ కేసుల్లో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. లెక్కకు మించిన ఆదాయం కేసుల్లో ఆస్తుల విలువ రూ.39కోట్లకు పైగా ఉందన్నారు. మరోవైపు నీటి పారుదల శాఖలో పలువురు ఇంజనీర్లు.. ఇంజనీర్ ఇన్ చీఫ్ మరళీధర్ రావు, నూనె శ్రీధర్‌తోపాటు మరో ఇంజనీర్ హరిరామ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు అధికారుల వద్దే దాదాపు రూ.1000 కోట్లకు పైగా అవినీతి నగదు ఉన్నట్లు ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు.






# అలా ఎన్‌కౌంటర్ నుంచి బయటపడ్డా

**ఆనాటి ఘటనపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తనను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేసినట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. నాడు జరిగిన సంచలన విషయాలను వివరించారు. తాను హిందువాహినిలో చేరి యువతను ధర్మం వైపు ఆకర్శితులయ్యేలా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో తమ కార్యక్రమాలకు ఎప్పుడూ ఏదో ఒక గొడవ సృష్టించేవారని, తాము ఎక్కడికి వెళితే అక్కడ 144 సెక్షన్ అమలు చేసేవారని రాజాసింగ్ తెలిపారు. ఎవరైనా హిందువులను మతం మార్చాలని ప్రయత్నిస్తే తాము అడ్డుకునే వాళ్లమన్నారు. మా వల్ల ఏదో ఒక గొడవ జరుగుతోందని అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్ కుట్రలు చేసింది. లేనిపోని కేసులు పెట్టి జైలుకు పంపారు. అప్పుడు కూడా ఆగలేదు. జైలుకు వెళ్లాం బయటకు వచ్చాం. మళ్లీ ధర్మం కోసం కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇలా ఎన్‌కౌంటర్ మిస్టరీని కూడా బయటపెట్టారు. కాంగ్రెస్ హయాంలో మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేశారని రాజాసింగ్ తెలిపారు. నన్ను, నాతో పాటు ఓ హిందూవాహిని కార్యకర్తను అడివిలోకి తీసుకెళ్లారు. ఎన్‌కౌంటర్ చేయడానికి ప్లాన్ చేశారు. నన్ను ఎన్‌కౌంటర్ చేయబోయే పోలీస్ కట్టర్ హిందు. నా గురించి ఆయనకు తెలియదు. ఉన్నతాధికారులు నన్ను ఎన్‌కౌంటర్ మాత్రమే చేయాలని ఆయనకు చెప్పారు. ఆ పోలీసు నన్ను అడవిలోకి తీసుకెళ్లి జీపు నుంచి కిందికి దింపారు. పరిగెత్తమని చెప్పాడు. ఆయన తన గన్ లోడ్ చేసుకుంటున్నాడు. అప్పుడే నాకు అర్థం అయ్యింది నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారని.. 'ఉరకడం ఎందుకు సార్.. ఇక్కడే కాల్చేయండి.' అని నేను ఆ పోలీసు అధికారికి చెప్పాను. ధర్మం కోసం చావాలనే మా కల ఇక్కడే చంపేయండి అని చెప్పాను. దీంతో ఆ పోలీసు అధికారి ఆలోచనలో పడ్డారు. వీళ్లు ధర్మం గురించి మాట్లాడుతున్నారేంటి? అని ఆలోచించారు. ఇంతకు మీరు ఎవరు? అని ఆ ఆఫీసర్ అప్పుడు మమ్మల్ని అడిగారు. దాదాపు రెండు గంటల పాటు- మా చరిత్ర ఆయనకు చెప్పాం. మిమ్మల్ని చంపి ఉంటే పెద్ద పాపం అయి ఉండేది అని ఆ పోలీస్ ఫీల్ అయ్యారు. దీంతో కొన్ని ఛానెల్స్‌కి ఆ పోలీసే స్వయంగా 'రాజాసింగ్‌ను ఎన్‌కౌంటర్ చేయబోతున్నారు.' అని మీడియాకు లీక్ చేశారు. దీంతో టీవీల్లో ఈ వార్త వచ్చింది. దీంతో నన్ను ఎవరైతే ఎన్‌కౌంటర్ చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారో వాళ్లే ఆపేయాలని ఈ అధికారికి ఫోన్ చేశారు. అలా ఎన్‌కౌంటర్ నుంచి బయట పడ్డామని రాజాసింగ్ సంచలన విషయాలు బయటపెట్టారు.

# సాగునీటి జలాలపై అవగాహన తెచ్చుకోండి

- బనకచర్లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా
- ఇదేమీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదని గుర్తుంచుకో
- నదీజలాల కేటాయింపులు తెలిసి మాట్లాడాలి
- కాళేశ్వరంను అడ్డుకోవడానికి చంద్రబాబు లేఖలు రాసారు
- లోకేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్ట్ 1:** సాగునీటి జలాల్లో నారా లోకేశ్‌కు అవగాహనం లోపం ఉందని, ఆయన యంగ్‌స్టర్.. భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారని, అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలు కావద్దని, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు.. పొక్కలు కొట్టేందుకు అని నారా లోకేశ్‌కు హరీశ్‌రావు వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గురువారం నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. కనబడుతలేదా అంటున్నాడు. అధికారం ఉంది కదా.. మందబలం ఉంది.. సీఎం రేవంత్, కేంద్రం మా చేతుల్లో ఉన్నారని ఏది మాట్లాడితే అది మాట్లాడితే చెల్లుతదనుకుంటే పొరపాటని అన్నారు. మిగులు జలాలు సముంద్రంలో కలుస్తున్నాయి అంటున్నారు కదా.. ఒక వేళ నీళ్లు ఉన్నదే నిజమైతే కేంద్ర ప్రభుత్వ సంస్థలు సెంట్రల్ వాటర్ కమిషన్ మీ డీపీఆర్‌ను ఎందుకు తిప్పి పంపింది. గోదావరి రివర్ మేనేజమెంట్ బోర్డు ఎందుకు తిప్పి పంపింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా తిరస్కరించింది. నీళ్లు ఉన్నది నిజమైతే నాలుగు కేంద్ర సంస్థలు బనచర్లకు ఎందుకు తిరస్కరించాయో లోకేశ్ సమాధానం చెప్పాలి. గోదావరిలో తెలంగాణ వాటా ఎంత..? ఏపీ వాటా ఎంతో సమాధానం చెప్పాలని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పొక్క కొట్టి తీసుకుపోతున్నామా? పొక్క కొట్టేందుకు ఇది ఏమైనా శ్రీశైలం ప్రాజెక్టా..? పోతిరెడ్డిపాడు ప్రాజెక్టా..? ఇది ఏమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశా? కాళేశ్వరం ఒక లిఫ్ట్ ఇరిగేష్ ప్రాజెక్టు.. దీనికి పొక్క కొట్టుడు, చిల్లు కొట్టు-డు ఉండదు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఈనాటి కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకోవడం వల్ల మీరు ఆడిందే ఆట పాడిందే పాట.. పోతిరెడ్డి పాడుకు పొక్క కొట్టి నీళ్లు తీసుకుపోయారు.. ఈనాటి కాంగ్రెస్ నాయకుల మౌనం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. కానీ ఇక్కడున్నది బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ రాష్ట్రంగా ఉంది. ఇష్టమొచ్చినట్టు పొక్క కొడుతాం అంటే చూసుకుంటూ ఊరుకోం అని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రాజెక్టుకు అనుమతి లేదని నారా లోకేశ్ మాట్లాడుతున్నాడు. ఒకటి కాదు రెండు కాదు 11 అనుమతులు ఉన్నాయి. అనుమతుల లేఖలు పంపిస్తాను వెరిఫై చేసుకోండి అని హరీశ్‌రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ బాబు ఏడు లేఖలు రాశారు. నిన్ననేమో మేం కాళేశ్వరం వ్యతిరేకించామా? అని లోకేశ్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హరీష్ రావు మాట్లాడుతూ.. 'బనకచర్ల కట్టి తీరుతాం అని లోకేష్ మాట్లాడుతున్నారు.. కేంద్రం బలం, రేవంత్ రెడ్డి బలం చూసుకొని లోకేష్ మాట్లాడుతున్నారు.. లోకేష్ అలా మాట్లాడినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదు.. సీఎం, మంత్రులు ఎవరూ కూడా ఖండించలేదు.. ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం నోరు మూసుకొని ఉంది.. మేము కడితే ఎవరు ఆపుతారో చూస్తాం అని లోకేష్ అంటుంటే.. బనకచర్ల కట్టట్లేదు అని రేవంత్ రెడ్డి అంటున్నాడు.. బనకచర్ల పై లోకేష్ బరితెగింపు మాటలు మాట్లాడుతున్నారు.. సాగునీటి ప్రాజెక్టుల పై లోకేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండి పడ్డారు. బనకచర్ల ప్రాజెక్టు ఆపే వరకు పోరాడతాము.. మీరు కట్టి తీరుతాం అంటే మేము అడ్డుకొని తీరుతాం.. తెలంగాణ ను అడ్డుకుంటే ఎలా తెచ్చుకున్నామో తెలుసు కదా.. కేంద్రం నీ చేతిలో ఉంది కాబట్టి సీడబ్ల్యూసీ ని ఒప్పిస్తాం అంటున్నావు.. లీగల్ గా కొట్లాడి బనకచర్ల ఆపుతామని హరీష్ రావు స్పష్టం చేశారు. అసలు నారా లోకేశ్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఎందుకు నోరు మెదపడం లేదని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్ తన పదవిని కాపాడుకోవడం కోసం.. బీజేపీ తమ పీఠాన్ని ఢిల్లీలో కాపాడుకునేందుకు టీడీపీకి సహకరిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు రాజకీయాలు

- ఆధ్రాకు మేలు చేసేలా గతంలో నిర్ణయాలు
- తప్పిదాలు సరిదిద్దేలా కాంగ్రెస్ అడుగులు
- పాదయాత్రలో బిఆర్ఎస్‌పైఘాటు విమర్శలు



**వికారాబాద్, ఆగస్ట్ 1:** బీఆర్ఎస్ అధినాయకత్వంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బనకచర్ల విషయంలో గత పాలకులదే ముమ్మాటికీ తప్పని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు- రాజకీయాలు చేసి ఆంధ్రా పాలకులకు మేలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దిశగా అడుగులు వేస్తోందని ఉద్ఘాటించారు. తాకట్టు పెట్టిన వాటాను వెనక్కు తేవడానికి ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగిలో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా పరిగిలో జనహిత పాదయాత్ర ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో 2014 నుంచి మొన్నటి వరకు గత బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అప్పటి ఆంధ్రా పాలకులకు కేసీఆర్, హరీష్‌రావు తలొగ్గి కాంప్రమైజ్ అయ్యారని ఫైర్ అయ్యారు మహేష్ కుమార్ గౌడ్. బనకచర్ల ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుకట్ట వేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు బయటకు వస్తాయని పసిగట్టి తమ ప్రభుత్వంపై ముందే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బనకచర్ల విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం తప్పు చేసింది... దాన్ని సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలు తెలుసుకోవడం అని ఆయన స్పష్టంగా తెలిపారు. మేము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రను ప్రారంభించాం. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ప్రజల జీవితాల్లో ఎదుర వుతున్న వాస్తవాలను నేరుగా తెలుసుకోవడానికి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఇదొక సాధనంలా వుంది,' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ యాత్రల నుండి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వరకు పాదయాత్రలు దేశ ప్రజలను చైతన్యపరిచిన ఉదాహరణలుగా నిలిచాయని గౌడ్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన పాదయాత్రలు కూడా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. అదే దారిలో టీ-పీసీసీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ యాత్రలో ఏఐసీసీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు- రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తదుపరి పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో తాము అధికారం చేపట్టామని, అయినప్పటికీ ప్రతి నెలా 6 వేల కోట్ల అప్పు చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గౌడ్ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిబంధనపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు-బడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకే స్పందనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వారికి న్యాయం చేయడమే మా లక్ష్యం, అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణలో రేషన్ కార్డుల పండుగ




- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మల ఇళ్లు
- వీటిపై బిఆర్ఎస్ నేతలో చర్చకు సిద్ధం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్1(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఇప్పుడు రేషన్ కార్డుల పండుగ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కొక్క నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉచిత బస్సులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని సంతోషం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ 3,500 ఇళు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగా 5500 రేషన్ కార్డులు ఇస్తున్నామని నొక్కిచెప్పారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నేతలు చర్చకు సిద్ధమా అని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. రేషన్ కార్డుల్లో అర్హులు ఉంటే లబ్ధిదారులందరికీ అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. రేషన్ కార్డుల్లో 2,30,000 మంది నూతన పేర్లు చేర్చామని చెప్పుకొచ్చారు. రేషన్ కార్డులు రాని పేదలు దరఖాస్తు చేసుకుంటే పార్టీలకు అతీతంగా అందజేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రోడ్లు, విద్యుత్, ఇతర సమస్యలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. 56941 రేషన్ కార్డులు ఉంటే 2లక్షల మందికి సన్నబియ్యం అందజేస్తున్నామని ప్రకటించారు. అభివృద్ధి పనుల్లో తమ ప్రభుత్వం రాజకీయం చేయదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రేషన్ కార్డుల పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11 ఏళ్ల తర్వాత తొలిసారిగా ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేసిందని ప్రకటించారు. గత కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించలేదని.. తమ ప్రభుత్వంలో రేషన్ కార్డుల కోసం ప్రజల ఎదురుచూపులకు తెరపడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సభలో వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృతంలోని తెలంగాణ ప్రభుత్వం సుమారు 6 లక్షల పై చిలుకు కార్డులను అందజేశామని తెలిపారు. దేదీప్య మాట్లాడుతుండగా మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డు తగిలారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణలో భారీ సంఖ్యలో రేషన్ కార్డులను తమ ప్రభుత్వం అందజేస్తోందని ఆక్వా చైర్మన్ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య మీడియాతో మాట్లాడారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ సభగా నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో పార్టీ తరపున ఎవరికీ సీటు- కేటాయించిన పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని దేదీప్య పేర్కొన్నారు.



# హెచ్ఎంఎస్ నేతతో ఎమ్మెల్సీ కవిత భేటీ

## సింగరేణిలో కలిసి పనిచేసేలా వ్యూహం

## నల్లనేల నుంచే సమరశంఖం పూరించేందుకు సిద్ధం

## 10న హెచ్ఎంఎస్, సింగరేణి జాగృతి చర్చలు

**హైదరాబాద్, ఆగస్టు 1:** హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి కార్మిక నేత రియాజ్ అహ్మద్ తో ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భేటీ అవడం కలకలం రేపుతోంది. ఈ సమావేశం రహస్యంగా సాగినప్పటికీ దీనికి సంబంధించిన వివరాలు బయటకు పొక్కాయి. రియాజ్ అహ్మద్ హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో కలుసుకుని సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల రక్షణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా తెలంగాణ జాగృతి సంస్థతో హెచ్ఎంఎస్ కలిసి పని చేసే అంశంపై దృష్టి సారించారు. ఈ విషయమై రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ చర్చలు జరిగిన విషయాన్ని అంగీకరించారు. కవితక్కతో ఇరువురు కలిసి పనిచేసే విషయంలో సానుకూల వాతావరణంలో చర్చించినట్లు చెప్పారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వేతన సవరణలు, కాంట్రాక్ట్ కార్మికుల పునర్నిర్మాణ హక్కులపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా కవిత కొత్త పార్టీవైపు మొగ్గు చూపుతోందనే ప్రచారం కొనసాగుతోంది. ఈ సమయంలో కవిత తనకు ఆది నుంచీ పట్టున్న సింగరేణిపై దృష్టి సారించారు. ఆమె కొద్ది రోజుల కిందట సింగరేణి జాగృతి పేరిట కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసి, కోఆర్డినేటర్లను కూడా నియమించారు. అదే సమయంలో సింగరేణి కార్మికసంఘ నేతలతో హైదరాబాద్ లో భేటీ అయ్యారు. అయితే, అదే సమయంలో బీఆర్ఎస్ అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి అనుబంధంగానే సింగరేణి జాగృతి కూడా పనిచేస్తుందని కవిత ప్రకటించారు. అయితే, టీబీజీకేఎస్ ఉన్నా కొత్త సంఘాన్ని ఎందుకు స్థాపించారనే ప్రశ్నలు కార్మిక వర్గంలో వెల్లువెత్తాయి. సింగరేణిలో తన పట్టు నిలుపుకుని ముందుకు వెళ్లాలనే ఆలోచనలో భాగంగానే కవిత ఉన్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ కు లేఖ రాసిన తర్వాత తన మొదటి పర్యటన సింగరేణి ప్రాంతంలో పెట్టుకుని తన వెంట వచ్చేదెవరు..? బలాబలాలు ఇలా అంచనా వేసిన కవిత సింగరేణి నుంచే తాడోపేడో తేల్చుకునేలా పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్ఎంఎస్ నేతలతో మంతనాలు చేసి కలిసి పనిచేసేలా వ్యూహం రూపొందిచారు. ఈ నెల 10న హెచ్ఎంఎస్ నేతలు, సింగరేణి జాగృతి నేతలు కలిసి భవిష్యత్ ప్రణాళిక రూపొందించనున్నారు.

# సచివాలయ సందర్శకులకు ఈ-పాస్

**హైదరాబాద్,ఆగస్ట్1:** రాష్ట్ర సచివాలయంలోకి సందర్శకుల ఎంట్రికి ఈ -పాస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విధానం విజిటర్ ఈ పాస్ మేనేజ్ మెంట్ సిస్టమ్ నుంచి అమలులోకి వచ్చింది. ఇకపై సచివాలయంలోకి నిత్యం ఎంతమంది సందర్శకులు ప్రవేశిస్తున్నారు, ఏయే ప్రభుత్వ శాఖల వద్దకు ఎంత మంది సందర్శకులు వెళ్తున్నారనే వివరాలు స్పష్టం అయ్యే అవకాశం ఉంది. కొత్త సచివాలయం నిర్మాణం పూర్తి అయ్యాక గత ప్రభుత్వం సచివాలయంలోకి సందర్శకులను, మీడియా ప్రతినిధులను అనుమతించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం రోజు నుంచి సచివాలయంలో మీడియాను, సందర్శకులను అనుమతిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలోసచివాలయంలోకి సందర్శకుల తాకిడితో పాటు- వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగి పోయింది. వాహనాలను భద్రతా తనిఖీలు నిర్వహించడం కూడా గగనంగా మారింది. అందరూ విఐపిలకు సంబంధించిన వారు కావడం వల్ల వారి వాహనాలను నిలిపితేనే కసురుకునే పరిస్థితులను భద్రతాసిబ్బంది ఎదుర్కొంటు-న్నారు. సచివాలయంలో మంత్రులఅ వద్దకు వచ్చే పెద్దలు కొందరు వాహన భద్రత ప్రమాణాలు పాటించకపోవడం గమనార్హం. ఎవ్వరిని నొప్పించకుండా భద్రతా సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు మంత్రుల పేషీల నుంచి వారికి మందలింపులు ఎదుర్కొనక తప్పడంలేదు. సచివాలయంలో పార్కింగ్ స్థలానికి మించి వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల సచివాలయం భద్రతాసిబ్బందికి కూడా ఇబ్బందికరంగా మారింది.

# ప్రజ్వల్ రేవణ్ణ రేపిస్టే

## దోషిగా తేల్చిన ప్రత్యేక కోర్టు • నేడు తీర్పును ప్రకటించే అవకాశం

**బెంగళూరు,ఆగస్ట్1 :** అత్యాచారం కేసులో జేడీఎస్ అధినేత దేవెగౌడ మనవడు, కర్ణాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దోషిగా తేలాడు. బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఈ తీర్పును వెలువరించింది. దీనిపై శనివారం శిక్ష ఖరారు చేయనుంది. ఈ తీర్పు వినగానే ప్రజ్వల్ కోర్టు గదిలోనే కంటతడి పెట్టుకున్నాడు. ప్రజ్వల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ దారుణాన్ని రికార్డు చేసి బెదిరించే వాడంటూ ఓ మహిళ సైబర్ క్రైమ్ స్టేషన్‌లో గతేడాది ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి 2వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసింది. విచారణలో భాగంగా 123 ఆధారాలను సేకరించింది. దీనిపై ప్రత్యేక న్యాయస్థానంలో డిసెంబర్ 31, 2024న విచారణ ప్రారంభమైంది. ఫొరెన్సిక్ ఆధారాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల వేళ హాసన సెక్స్ కుంభకోణం కర్ణాటకలో ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఓ మహిళ షాకింగ్ విషయాలు వెల్లడించింది. తన తల్లిపై కొన్నేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు- ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అంతే కాకుండా ప్రజ్వల్ వీడియో కాల్‌లో బెదిరించి తన దుస్తులు విప్పించినట్లు- తెలిపింది. అందుకు నిరాకరిస్తే.. నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే.. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

## సంపాదకీయం



# విపత్తు సాయం కోసం ప్రత్యేక దళం!

విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ఈ దిశగా ఆలోచ నలు చేసి ఆచరణకు సిద్ధపడాలి. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్మీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వర సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక శిక్షిత సిబ్బందంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించవచ్చు. లేకుంటే కేంద్రబృందం ఎప్పుడో నెల తరవాత రావడం...పోటోలు చూడడం.. అంచనా వేయడం జరుగుతోంది. అలా గాకుండా వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ
- నామినేషన్లు దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ
- సెప్టెంబర్ 9న ఎన్నిక.. అదేరోజు ఫలితం ప్రకటన







**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ పక్రియ అనివార్యమైంది. పార్లమెంటు- వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఇదిలావుంటే ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# మాలెగావ్ కేసులో కొత్త విషయాలు



- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భగవత్ అరెస్ట్‌కు అప్పట్లో కుట్ర
- మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ ప్రకటన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరినీ ముంబయిలోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన క్రమంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నాటి యూపిఎ హయాంలో జరిగిన ఈ కేసులో సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్‌పై నేరం మోపారు. తాజా తీర్పుతో ఆమెతో పాటు పలువురు నిర్దోషులుగా తీర్పువచ్చింది. ఈ క్రమంలో నాటి కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ మాట్లాడుతూ కీలక ఆరోపణలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో ఇప్పుడు ఈ విషయం సంచలనంగా మారింది. అంటే ఇదంతా కుట్రపూరితంగా సాగిందని తెలుస్తోంది. శుక్రవారం ముజావ్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి కొంతమంది వ్యక్తులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వారిలో రామ్ కల్సంగ్రా, సందీప్ దాంగే, దిలీప్ పాటిదార్‌తో పాటు- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా ఉన్నారన్నారు. అలాంటి ప్రభావం చూపే వ్యక్తిని అరెస్టు చేయడం అంటే అది తన శక్తికి మించిందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు- ఆయన తెలిపారు. వారి సూచనల ప్రకారం.. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందిని సమకూర్చారన్నారు. నిధులు సమకూర్చడంతో పాటు అధికారికంగా రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలను ప్రధాన నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదైంది. ఈ కేసుపై ముంబయిలోని ప్రత్యేక కోర్టులో గురువారం విచారణ జరగ్గా.. నిందితులందరి నీ నిర్దోషులుగా ప్రకటించింది. ఇదంతా ఒక ఎత్తయితే ముజావ్ చేసిన ప్రకటన ఇప్పుడు ప్రకంపనలు రేపనుంది.

# నన్స్ అరెస్ట్‌పై కొనసాగుతున్న ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** ఛత్తీస్‌గఢ్‌లో కేరళ నన్స్ అరెస్ట్ వ్యవహారం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. దుర్గ్ రైల్వేస్టేషన్‌లో జులై 25న కేరళకు చెందిన ఇద్దరు నన్స్ సిస్టర్ ప్రీతి మేరీ, సిస్టర్ వందన ఫ్రాన్సిస్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి. అయితే, ఈ ఘటన ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్లమెంటు- వెలుపల సైతం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా పులువురు రాజకీయ నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసనలకు దిగారు. అటు-, కేరళ వ్యాప్తంగా క్రిస్టియన్ వర్గాలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన ఇద్దరు కేరళ నన్స్ లను వెంటనే విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ విల్సన్ .. కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు గిరిజన యువతులతో కలిసి ప్రయాణిస్తున్న నన్స్‌ను బజరంగ్ దళ్ సభ్యులు అడ్డుకున్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మతమార్పిడి చేస్తున్నారని నన్స్ మీద బజరంగ్ దళ్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సదరు యువతులు స్వచ్ఛందంగా ఉద్యోగ అవకాశాల కోసం ఆగ్రా వెళ్తున్నారని, వారి దగ్గర చెల్లుబాటు- అయ్యే డాక్యుమెంట్లు- కూడా ఉన్నాయని నన్స్ వాదించారు. అయినప్పటికీ, ఈ ఆరోపణల ఆధారంగా నన్స్‌ను అరెస్టు చేసి దుర్గ్ సెంట్రల్ జైలులో ఉంచారు.




# ఎన్నికల సంఘం అక్రమాలపై అణుబాంబులాంటి ఆధారాలు

### ఈసీపై విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** ఎన్నికల సంఘంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ అక్రమాలకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయన్నారు. ఈ ఓట్ల చోరీ అక్రమాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని.. బిజెపి కోసం ఈసీ ఓట్లను చోరీ చేస్తోందని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ధ్వజమెత్తారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొత్తగా కోటి ఓట్లు చేర్చారని పేర్కొన్నారు. ఈసీ అక్రమాలపై ఆరు నెలలపాటు దర్యాప్తు చేశామన్నారు. అణుబాంబు లాంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని.. ఆ అణుబాంబు పేలితే ఎన్నికల సంఘమే ఉండదని హెచ్చరించారు. ఈసీలో అక్రమాలకు పాల్పడిన ఏ స్థాయి అధికారినైనా, ఒకవేళ రిటైరైనా వదిలి పెట్టామని స్పష్టం చేశారు.

# గుజరాత్‌లో పర్యటించిన ఒమర్ అబ్దుల్లా

### ఈ పర్యటన ఐకమత్యాన్ని చాటిందన్న ప్రధాని

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇటీవల గుజరాత్‌లో టూర్ చేశారు. ఈ నేపథ్యంలో సీఎం ఒమర్ అబ్దుల్లా.. సబర్మతి రివర్‌ఫ్రంట్‌తో పాటు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సందర్శించారు. అక్కడ దిగిన ఫోటోలను తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ ఫోటోలపై ప్రధాని మోదీ రియాక్ట్ అయ్యారు. సబర్మతి, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద జమ్మూకశ్మీర్ సీఎం టూర్ చేయడం సంతోషకరమని ప్రధాని అన్నారు. అబ్దుల్లా పర్యటన ఐకమత్యాన్ని చాటుతుందన్నారు. భారతీయులు ఇతర ప్రాంతాల్లో టూర్ చేసేందుకు ఈ ఘటన ఇన్స్‌పిరేషన్‌గా నిలుస్తుందన్నారు. జమ్మూకశ్మీర్‌కు పర్యాటకం కీలకమైంది. ఇటీవల పెహల్గామ్ దాడితో ఆ రాష్ట్ర ఆదాయం తగ్గింది. ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంతో సీఎం అబ్దుల్లా.. పర్యాటకుల్ని ఆకర్షించేందుకు గుజరాత్ టూర్ చేపట్టారు. ప్రధాని మోదీ తన ఫోటోలపై రియాక్ట్ కావడంతో.. సీఎం ఒమర్ అబ్దుల్లా దానికి కౌంటర్ పోస్టు చేశారు. ట్రావెల్ చేయడం వల్ల మన హద్దులు, మనసులు విస్తరిస్తాయి ప్రధాని గారు అంటూ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో టూరిజం కీలకమైందని, లక్షల మందికి ఆదాయం అదే అన్నారు. అందుకే మా రాష్ట్రానికి వచ్చేలా భారతీయ పర్యాటకుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఓ టూరిజం ఈవెంట్‌లో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం అబ్దుల్లా .. సబర్మతి రివర్ ఫ్రంట్ వద్ద మార్నింగ్ రన్ చేశారు.

# దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్నది మన రాష్ట్రమే

మొదటి పేజీ తరువాయి

నీటిని వాడుకుంటే కరువు అనేదే ఉండదని, రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉపాధి కోసం యువత వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం రాకూడదని, త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతాయని హామీ ఇచ్చారు. 2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పనులు పూర్తి చేస్తామని, రేపు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తున్నామని అన్నారు. ఎపి రూ. 14 వేలు, కేంద్రం రూ. 6 వేలు మొత్తంగా రైతులకు రూ. 20 వేలు ఇవ్వబోతున్నాం అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పింఛను ఇచ్చే రాష్ట్రం ఏపీ అని సీఎం చంద్రబాబు అన్నారు. అర్హులైన వితంతువులకు సాయం చేస్తున్నామని చెప్పారు. పింఛన్ల విషయంలో మన తర్వాత తెలంగాణ, కేరళ ఉన్నాయన్నారు. పేదలకు సాయం చేస్తే కలిగే తృప్తి మరిదేంట్లోనూ రాదని చెప్పారు. ఈ సందర్భంగా జగన్, వైకాపా నేతల తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగితే మాపై విషం చిమ్మారు. అనేక మాటలు మారుస్తూ నాపై అభాండాలు వేసి అసత్యాలు రాశారు. మహిళా ఎమ్మెల్యేపైనా దూషణలకు దిగుతున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురించి ఇష్టానుసారంగా నోరుపారేసుకున్న వ్యక్తిని మందలించాల్సింది పోయి ఇంకా రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తి జగన్. పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే కట్టడి చేయాలి.. ఖండించాలి. నాయకుడే రెచ్చగొడితే ఇక కిందిస్థాయి నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడతారు. ప్రతిచోటా డ్రోన్లు పర్యవేక్షిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండాలి. మభ్యపెట్టి, మోసం చేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవు. సాక్షి పత్రికలో వచ్చిందని నమ్మితే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్లేనని అన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. 2028 డిసెంబర్ నాటికి తొలి దశ పనులను పూర్తిచేయాలని స్పష్టంగా ఆదేశాలిచ్చా. స్టీల్‌ప్లాంట్‌తో జమ్మలమడుగు ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మంచి కార్యక్రమాన్ని చెడగొట్టడం.. పడగొట్టడం ఈజీ.. నిలబెట్టడమే కష్టం. వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు- విధ్వంసం చేశారు.. కేంద్ర పథకాలను నిలిపివేశారు. తల్లికి వందనం హామీని నిలబెట్టుకున్నాం.. ఏడుగురు పిల్లలున్నా ఇచ్చాం. అమెరికాకు గ్రాండ్ క్యానియన్‌లా మనకు గండికోట ఉంది. దాన్ని ఆకర్షణీయ ప్రాంతంగా తయారు చేస్తాం. అక్కడ రూ.85కోట్లతో పనులు ప్రారంభిస్తాం. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు- చేస్తాం. గతంలో గండికోట ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తిచేశా. హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టాం. 2024 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు సీట్లు గెలిచాం. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు- గెలిపించేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు అన్నారు. మంత్రి సవిత, ఎ÷-మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## చేనేత మరమగ్గాలకు ఉచిత విద్యుత్

### ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ఆమోదం

చేనేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. శుక్రవారం ఆగస్టు1 నుంచే ఉచిత విద్యుత్ అమలుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం ఇచ్చారు. మగ్గాలకు 200 యూనిట్లు-, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ప్రకటించారు. నేతన్నల ఉచిత విద్యుత్‌కు రూ.125 కోట్ల వ్యయాన్ని ఏపీ ప్రభుత్వం ఖర్చు చేయనుంది. అయితే, 50 వేల మగ్గాలు, 15 వేల మర మగ్గాలు కలిగిన కుటుంబాలకు ఉచిత విద్యుత్ ద్వారా లబ్ధి చేకూరనుంది. చేనేతలకు ఇచ్చిన ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు దృష్టికిమంత్రి సవిత తీసుకెళ్లారు. జాతీయ చేనేత దినోత్సవానికి వారం ముందుగానే ఉచిత విద్యుత్ పథకం అమలుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. చేనేతలకు ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. కడప జిల్లాలోని జమ్మలమడుగులో శుక్రవారం సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా చేనేతల ఉచిత విద్యుత్ అమలుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మ-రోవైపు, వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాజధాని రైతు కూలీ పెన్షన్లను కూటమి ప్రభుత్వం తిరిగి మంజూరు చేసింది. ఈ సందర్భంగా కృష్ణయపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు రాజధాని రైతులు పాలాభిషేకం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని రైతు కూలీ పెన్షన్లను నిలిపివేసింది. రాజధాని ప్రాంత రైతు కూలీలకు పెన్షన్లు మంజూరైన నేపథ్యంలో హర్షం వ్యక్తం చేశారు కూలీలు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను యథావిధిగా కొనసాగిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు చంద్రబాబు కట్టుబడి పెన్షన్లను మంజూరు చేయటం పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## తప్పు చేస్తే ఖండించకుండా...వెనకేసుకొస్తారా

**కడప :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ట్రాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు.కడప జిల్లా జమ్మలమడుగులో సీఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించారు. గూడెంచెరువులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అసభ్యంగా మాట్లాడిన వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మాటలని జగన్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రసన్నని జగన్ పరామర్శించడం ఏంటనీ ధ్వజమెత్తారు. పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే కట్టడి చేయాలి.. ఖండించాలని హితవు పలికారు. నల్లపురెడ్డిని మందలించాల్సింది పోయి.. జగన్ ప్రోత్సహిస్తు న్నారని దుయ్యబట్టారు. మహిళలపై ఇంకా విరుచుకుపడాలనే ధోరణిలోనే జగన్ వైఖరి ఉందని మండిపడ్డారు. నాయకుడే రెచ్చగొడితే కిందిస్థాయి నేతలు ఇష్టానుసారం మాట్లాడరా? అని చంద్రబాబు నిలదీశారు. జగన్ అండ్ కో లాంటి వ్యక్తులు రాజకీయాలకు అవసరమా? అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తోక కట్ చేస్తానని హెచ్చరించారు. ఇటీవల బంగారుపాళ్యంలో జగన్ పర్యటన దృశ్యాలను.. నెల్లూరులో ఆయన పర్యటనకు వచ్చినట్లు-గా చూపించారని విమర్శించారు. వితండవాదం చేయడంలో వైసీపీ నేతలు ఎప్పుడూ ముందుంటారని ఆరోపించారు. ప్రతి చోటా డ్రోన్లు పర్యవేక్షిస్తున్నా యని.. తస్మాత్ జాగ్రత్త అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గూడెంచెరువు గ్రామం నుంచి ప్రజావేదిక వద్దకు ఆటోలో పెళ్లారు సీఎం చంద్రబాబు. ఈ క్రమంలో ఆటో కార్మికుడికి బాడుగ ఇవ్వగా.. చంద్రబాబుకు ఆటోవాలా పాదాభివందనం చేశారు. అనంతరం గూడెంచెరువులో సీఎం చంద్రబాబు పేదల సేవలో ప్రజావేదిక బహిరంగసభలో ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆలోచన నుంచే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన చేసినట్లు- సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. రూ.3,800 కోట్లతో హంద్రీనీవా పనులు చేపట్టామని చెప్పుకొచ్చారు. త్వరలోనే హంద్రీనీవా పనులు పూర్తిచేసి చెరువులన్నీ నింపుతామని స్పష్టం చేశారు. సముద్రంలోకి వెళ్లే నీటిని వాడుకుంటే కరవు అనేదే ఉండదని వివరించారు. రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. త్వరలోనే కడప స్టీల్‌ఎ÷-లాంట్ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి స్టీల్‌ఎ÷-లాంట్ తొలిదశ పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. రేపు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ఏపీ ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇవ్వబోతున్నాయని స్పష్టం చేశారు. మొత్తంగా రైతులకు రూ.20 వేలు ఇవ్వబోతున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశానికి కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత, టీడీపీ ఎమ్మెల్యేలు, 4 బంగారు కుటుంబాల మార్గదర్శకులు, చేనేతలు, ప్రజలు హాజరయ్యారు.

## జగన్ లిక్కర్ డెన్‌ల డాన్: ఆదినారాయణ

**కడప :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని పీ5గా భాజపా ఎమ్మెల్యే ఆదినారాయ-ణరెడ్డి అభివర్ణించారు. ఐదో 'పి'ని 'పవర్‌ఫుల్' అని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం గూడెం చెరువులో సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి లోకేశ్‌ను తండ్రికి మించిన తనయుడంటూ సీఎం చంద్రబాబు ఎదుటే ప్రశంసించారు. ఈ క్రమంలో జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. జగన్ లిక్కర్ డెన్‌ల డాన్. సూపర్ సిక్స్ పథకాలతో కడప జిల్లాలో జగన్‌కు సూపర్ చెక్ పెడతాంఅని ఆదినారాయణరెడ్డి అన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు.

## కానిస్టేబుళ్ల ఫలితాలు విడుదల

**అమరావతి :** ఏపీలో 6,100 పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి తుది ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో హోంమంత్రి అనిత వీటిని విడుదల చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఆర్.కె.మీనా పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గండి నానాజి 168 మార్కులతో ప్రథమ స్థానంలో, జి.రమ్య మాధురి (159) రెండో స్థానంలో, మెరుగు అచ్యుతారావు(144.5) మూడో స్థానంలో నిలిచారు.

## ఆర్థికస్థితివిషమంగా ఉన్నా సంక్షేమం ఆగడం లేదు

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి సంక్షేమం చేస్తున్నామన్నారు. ఓటమి నుంచి పాటలు నేర్చుకోకుండా జగన్మోహన్ రెడ్డి అదే విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి పర్యటనలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఒకటో తారీకు వస్తే పండగ వాతావరణం నెలకొంటుందని.. వైసీపీ పాలనలో వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచేందుకు ఐదేళ్లు పట్టిందన్నారు. జగన్ పింఛన్లు పెంచుతామని ప్రజలను మోసం దగా చేశారని..ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి 2047 కి రాష్ట్రాన్ని ప్రపంచంలోనే తెలుగుజాతిని అగ్రస్థానంలో ఉంచాలని కృషి చేస్తున్నారన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి ధ్వంసం చేయాలని ఆలోచించడం దురదృష్టకరమన్నారు. గంజాయి బ్యాచ్లకు బ్లేడ్ బ్యాచ్లకు బెట్టింగ్ బ్యాచ్లకు పరామర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అవినీతిలో భాగస్వామ-ులై, ప్రజలను లూటీ- చేసి జైల్లో ఉన్న వ్యక్తులను జగన్ పరామర్శిస్తున్నారు.. జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని, వాటి గురించి మాట్లాడే అర్హతయే జగన్ కు లేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బయటకు వచ్చేవారు కాదన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. ఒకవేళ బయటకు వస్తే ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టులు చేసేవారు. ఐదేళ్లపాటు-కక్షలు వేధింపులు పాలనను ఎవ్వరూ మర్చిపోలేదు. జగన్ కు ప్రజాస్వామ్యం గురించి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత లేదు. ఐదేళ్లపాటు- ఒక హిట్లర్ ముషారఫ్ వంటి వ్యక్తులు కూడా అసూయపడేలా పాలన చేశారు. ఐదేళ్ల జగన్ పాలన నుంచి ప్రజలు విముక్తి పొందారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వతంత్రం లభిస్తే 2024లో రాక్షస పాలన నుంచి విముక్తి పొంది ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారు. జగన్ దొంగ ఏడుపులను అబద్దాలను నమ్మే పరిస్థితి రాష్ట్రంలో లేదు. అన్యాయం గా అరెస్టు చేస్తున్నారంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదం. చట్టం తన పని తాను చేసుకోని వెళ్తుంది. తప్పు చేసిన వారే జైల్లో ఉన్నారని కక్ష సాధింపుగా ఎవరిని జైల్లో పెట్టలేదు. మిథున్ రెడ్డిని కూడా కూటమి అధికారంలోకి వచ్చాక జైల్లో పెట్టలేదని సంవత్సరం పాటు- విచారణ దర్యాప్తు చేసి ఆధారాలు అన్నిటిలతోనే అరెస్టు చేశాం. అరెస్టు అవకుండా మిథున్ రెడ్డి న్యాయస్థానానికి వెళితే అవి కూడా తిరస్కరించాయి. ప్రజల సొమ్ములను లూటీ- చేసారని ఆధారాలు ఉండబట్టే కోర్టులు బెయిల్ ఇవ్వడానికి తిరస్కరించాయి. ప్రైవేట్ చేతిలో ఉండే లెక్కల వ్యాపారాన్ని జగన్ తన చేతిలోకి తీసుకున్నారా లేదా చెప్పాలి. బ్రాందీ అమ్మకం సర్కార్ పేరు మీద జగన్ చేతిలో ఉందో లేదో చెప్పాలి. రోడ్డు పక్కన అమ్మే జామకాయలు బండి దగ్గర కూడా ఫోన్ పే ఉంటు-ందని, సర్కార్ నిర్వహించే బ్రాందీ షాపుల్లో ఎందుకు ఫోన్ పే పెట్టలేదు. ఐదేళ్లపాటు- సర్కార్ పేరు చెప్పి విచ్చలవిడిగా ప్రజల సొమ్ము లూటీ- చేశారు. వైసీపీ పాలనలో జగన్ వెనకేసిన కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వెనక్కి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి నిమ్మల వ్యాఖ్యానించారు.

## జగన్‌ను ఆపటం మీ తరం కాదు

మొదటి పేజీ తరువాయి



జగన్ విషయాలు మాట్లాడటం, తిట్టే కార్యక్రమాలు మాత్రమే చేస్తుందని రాంబాబు ఫైర్ అయ్యారు.. తల్లి, చెల్లి వాటాల గురించి చెప్తుంది.. మీ కుటుంబం గురించి మాకు తెలియదా అని రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు ఇష్టానుసారం పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు.. రాజధాని, పోలవరం నిర్మాణం సంగతి మర్చి పోయారని మండిపడ్డారు.. తమ మంత్రి వర్గంలో ఉన్నవాళ్ళ జైళ్లకు పంపుతున్నారు.. అయితే ఏమవుతుంది.. రేపు మావాళ్ళు అధికారంలోకి వచ్చాక మా వాళ్ళు ఇదే చేయమంటారు కదా..? అన్నారు.. కొంతమంది ఐపీఎస్ అధికారులపై టీ-డీపీ అధికారంలోకి అక్రమ కేసులు పెట్టిందని.. మీరేమీ అతీతులు కాదన్నారు. రాజకీయంగా మమ్మల్ని అణగదొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని.. నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచించారు.. లోకేష్ ఇప్పుడు హై క్యాష్.. అధికారం మూన్నాళ్ళ ముచ్చట అని తెలుసుకోవాలన్నారు.. ప్రసన్న కుమార్ రెడ్డి ఒక మహిళను ఇష్టానుసారం మాట్లాడారని మీ అభియోగం.. ఆయన మీద కేసులు పెట్టారు కదా.. ఎందుకు దాడి చేశారు.. మా నాయకుడ్ని మేం పరమర్శకు తప్పేంటి. వాళ్ళు నేరారోపణ చేయబడిన వ్యక్తులు తప్ప నేరస్తులు కాదు.. ఆ లెక్కకు వస్తే చంద్రబాబు కూడా జైల్లో ఉన్నారు.. చిట్టినాయుడు పిట్ట కథలు గతంలో పర్యటనల సందర్భంగా చాలా విన్నాం.. ఈశ్వర్ కు వీళ్లకు జరిగిన లావాదేవీలపై సెటిల్మెంట్ కోసం సింగపూర్ వెళ్ళారు.. డౌట్ ఉంటే కనుక్కోవాలి.. డిస్టిల్లరి కంపెనీ లు ఏమి కొనుక్కుంటే ఎవరికి సంబంధం.. కట్టు-కదలతో వైసీపీ వాళ్లను వేధిస్తున్నారు.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలులో ఉన్న సమయంలో ప్రజాధారణకు ఇప్పుడు ఉన్న ప్రజాదరణకు చాలా తేడా ఉంది.. జగన్ పర్యటనల సమయంలో జనం వచ్చిన విజువల్స్ చూపించాల్సిన అవసరం లేదు.. విజువల్స్ మార్ఫింగ్ చేయాల్సిన దుస్తితి మాకు లేదు.. జనం రాకపోతే అసలు లాఠీఛార్జ్ ఎందుకు చేశారు.. హోం మంత్రి గారు సమాధానం చెప్పాలి.. వాళ్ళు ఎంత కట్టడి చేస్తే అంత జనం వస్తున్నారు.. చంద్రబాబు మా తోకలు కట్ చేయటం కాదు.. మా తోకలు జనం కట్ చేశారు.. మీ తోకలు కట్ చేయకుండా చూసుకోండి.. మీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా జగన్ మీద ఎన్ని మాటలు చెప్పినా నమ్మరు.. గతంలో వైఎస్ మీద ఇప్పుడు జగన్ మీద వ్యక్తిత్వ హననం చేయాలని చూస్తున్నారు.. టీ-డీపీ హయాంలో మామీద పెట్టిన కేసులు ఒక్కటి నిలబడ్డా నన్ను అడగండి.. ఒక్క కేసు కూడా నిలబడదు.. అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.



## గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

బీఆర్ నాయుడు శుక్రవారం భేటీ- అయ్యారు. గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు కీలక అంశాలపై సీఎంతో తితిదే ఛైర్మన్ చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు. దీనికి స్పందించిన సీఎం హిమంత.. ఐదు ఎకరాల స్థలంతోపాటు- ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. తమ రాష్ట్ర రాజధానిలో తిరుమల శ్రీవారి అద్భుతమైన ఆలయం నిర్మించాలని తితిదే నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్పగా భావిస్తున్నట్లు సీఎం అన్నారు. తితిదే ఆధ్వర్యంలో నిర్మించబోయే శ్రీవారి ఆలయం ద్వారా హిందూధర్మ పరిరక్షణ, సంప్రదాయాలు, హిందుత్వ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## గుంటూరు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు :** గుంటూరు జిల్లా అభివృద్ధిపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం పొన్నూరు మండలం మామిళ్ళపల్లిలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ధూలిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మీడియాతో మాట్లాడారు. రాఘవేంద్రప్రసాద్, కల్యాణి దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.4 కోట్లు- విరాళం ఇవ్వడం అభినందనీయమని ప్రశంసించారు. దాతల విరాళంలోని రూ.40 లక్షలతో బీసీల కమ్యూనిటీ- భవన నిర్మానానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఈ భవన నిర్మాణ శంకుస్థాపన చేపట్టిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతకు ముందు.. గుంటూరు నగరాభివృద్ధిపై నగర కార్పొరేషన్‌లో ఇవా(శుక్రవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. గుంటూరు నగరంలోని సమస్యలపై ప్రతి మూడు నాలుగు వారాలకు సమీక్ష నిర్వహిస్తు న్నామని తెలిపారు. శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శంకర్ విలాస్ బ్రిడ్జి పనుల్లో నష్టపోయిన 74 మందికి నష్టపరిహారం అందించామని గుర్తుచేశారు. ఎనిమిది నెలల్లో నంది వెలుగు బ్రిడ్జి పూర్తి చేస్తామని సంబంధిత పనుల కాంట్రాక్టర్ చెప్పారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. సెప్టెంబర్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు థర్డ్ ఫేజ్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పీవీకే నాయుడు మార్కెట్ స్థానంలో రూపొందించిన డిజైన్ నచ్చలేదని చెప్పారు. ఆ డిజైన్ మార్చాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. గుంటూరు నగరంలో శానిటేషన్ బాగా ఇంప్రూవ్ అయిందని తెలిపారు. నగర

సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఉద్ఘాటించారు. మూడు వంతెనల వద్ద నీరు నిల్వకుండా చేయాలంటే 200 ఆక్రమణలను తొలగించాల్సి ఉంటు-ందని చెప్పారు. దీర్ఘకాలిక ప్రక్రియలో భాగంగా ఆక్రమణలను తొలగిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధికి విరాళం ప్రకటించిన దాతల సహకారం అభినందనీయమని తెలుగుదేశం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవం నిలబెట్టడానికే తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను కేంద్ర మంత్రి పెమ్మసాని ద్వారా పరిష్కరించడం అభినందనీయమని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రశంసించారు.

# ప్రొటీన్ లోపం ఆరోగ్యానికి ఎంత హానికరమో తెలుసా..?

**ప్రొటీన్ అనేది అత్యంత ముఖ్యమైన స్థూల పోషకం. ప్రొటీన్ కేవలం కండరాల నిర్మాణానికి మాత్రమే తోడ్పడదు. శరీరంలోని ప్రతి కణం, కణజాలం, అవయవాల పనితీరుకు అవసరం. హార్మోన్లు, ఎంజైమ్‌లు, రోగనిరోధక కణాలు, రవాణా ప్రొటీన్ల ఉత్పత్తిలో ప్రొటీన్ కీలకపాత్ర పోషిస్తుంది. రోజువారీ ఆహారంలో మనం తగినంత ప్రొటీన్ తీసుకోనప్పుడు మన శరీరం వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..**



**కండరాల బలహీనత**

ఈ కండరాల బలహీనత అనేది ప్రొటీన్ లోపానికి అత్యంత స్పష్టమైన సంకేతం. శరీరానికి తగినంత ప్రొటీన్ అందనప్పుడు అది తన కండర కణజాలాలను విచ్ఛిన్నం చేసి అవసరమైన అమైనోఆమ్లాలను పొందుతుంది. దీనివల్ల కండరాల బలం తగ్గి.. బలహీనత, అలసట, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది లాంటి సమస్యలు కలుగుతాయి. వ్యాయామం చేసినా కండరాలు పెరగకపోవడాన్ని, క్షీణించడాన్ని గమనించవచ్చు.

**రోగనిరోధక వ్యవస్థ బలహీనం**

మన రోగనిరోధక వ్యవస్థలోని కణాలు, ముఖ్యంగా యాంటీబాడీస్ ప్రొటీన్‌తో తయారవుతాయి. కాబట్టి ప్రొటీన్ లోపం రోగనిరోధక శక్తిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దానివల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, జలుబు, ఫ్లూ తదితర వ్యాధులకు గురవుతుంది. కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టడం, తరచుగా అనారోగ్యాల బారిన పడటం లాంటివి సంభవిస్తాయి.

**జుట్టు సమస్యలు**

జుట్టు ప్రధానంగా ప్రొటీన్ (కెరాటిన్) తో తయారవుతుంది. ప్రొటీన్ లోపంవల్ల జుట్టు సన్నబడటం, పొడిబారడం, బలహీనపడటం, విపరీతంగా రాలిపోవడం లాంటి సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు జుట్టు రంగు కూడా మారపోయే అవకాశం ఉంది.

**చర్మ సమస్యలు**

ప్రొటీన్ లోపం చర్మ సమస్యలకు కూడా దారితీస్తుంది. కొల్లాజెన్, ఎలాస్టిన్ అనే ప్రొటీన్లు చర్మం స్థితిస్థాపకతకు, ఆరోగ్యానికి అవసరం. ఈ కొల్లాజెన్, ఎలాస్టిన్ లోపంతో చర్మ సంబంధ సమస్యలు వస్తాయి. చర్మం పొడిగా, పొలుసులుగా మారుతుంది. అదేవిధంగా చర్మంపై పగుళ్లు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

**గోర్లు పెలుసుబారడం**

చేతుల, కాళ్ల గోర్ల ఆరోగ్యానికి కూడా ప్రొటీన్ దోహదపడుతుంది. ప్రొటీన్ లోపంవల్ల గోర్లు పెలుసుగా మారడం, సులభంగా విరిగిపోవడం, గోర్లపై గీతలు ఏర్పడటం లాంటి సమస్యలు వస్తాయి.

**ఎడీమా (వాపు)**

ఎడీమా శరీరంలో ద్రవ సమతుల్యత లోపంవల్ల వస్తుంది. ప్రొటీన్‌లు రక్తంలో ప్లాస్మా ఆంకోటిక్ పీడనాన్ని నిర్వహించడంలో సాయపడతాయి. ఈ పీడనం రక్తనాళాల నుంచి కణజాలంలోకి ద్రవం లీక్ అవ్వకుండా నిరోధిస్తుంది. ప్రొటీన్ లోపంవల్ల ఈ పీడనం తగ్గుతుంది. ఫలితంగా ద్రవం కణజాలాలలో పేరుకుపోయి కాళ్లు, చీలమండలు, పాదాలు, చేతుల్లో వాపు వస్తుంది.

**బలహీన ఎముకలు**

ప్రొటీన్ ఎముకల ఆరోగ్యంలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. ఇది కాల్షియం శోషణ, ఎముకల సాంద్రతకు సాయపడుతుంది. తగినంత ప్రొటీన్ లేకపోతే ఎముకలు బలహీనపడి వాటిలో పగుళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది.

**బరువు పెరగడం**

ప్రొటీన్ శరీరానికి సంతృప్తిని పెంచుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. ప్రొటీన్ తక్కువగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు ఆకలి ఎక్కువగా ఉంటుంది. దాంతో అతిగా తింటాం. ఫలితంగా బరువు పెరిగే అవకాశం ఉంది.

**శక్తి హీనత**


ప్రొటీన్ శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. ప్రొటీన్ లోపంవల్ల రక్తహీనత ఏర్పడి తీవ్రమైన అలసట, బలహీనత, తల తిరగడం లాంటి సమస్యలు సంభవిస్తాయి.

**ఎంత ప్రొటీన్ అవసరం..?**

ఒక సాధారణ ఆరోగ్యవంతుడైన వ్యక్తికి ప్రతి కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. అయితే నిత్యం వ్యాయామం చేసేవారికి, గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు, వృద్ధులకు, కొన్ని అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి ప్రొటీన్ అవసరం కొంత ఎక్కువగా ఉంటుంది.

**ప్రొటీన్ రిచ్ ఫుడ్స్**

మాంసం, చేపలు, గుడ్లు, పాలు, పెరుగు, చీజ్, పప్పులు, బీన్స్, చిక్కుళ్ళు, కాయధాన్యాలు, గింజలు లాంటి వాటిలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.



# ఊపిరితిత్తుల ఆరోగ్యం కోసం వీటిని తీసుకోండి..!

నేటి కాలంలో, వాయు కాలుష్యం ప్రజల ఊపిరితిత్తులపై చెడు ప్రభావాన్ని చూపుతోంది. విషపూరిత గాలి శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులను దెబ్బతీస్తోంది. దీని కారణంగా, అనేక ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, విషపూరిత గాలి ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు పెద్ద కారణంగా మారుతోంది. నగరాల్లో ప్రజలు ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు.

ధూమపానం, అనారోగ్యకరమైన ఆహారం, చెడు జీవనశైలి కూడా మన ఊపిరితిత్తులపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. అటువంటి పరిస్థితిలో ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం. ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అటువంటి సూపర్‌ఫుడ్‌ల గురించి తెలుసుకుందాం..

**అల్లం**

అల్లం ఒక శక్తివంతమైన ఔషధ మూలిక, ఇది శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. శ్లేష్మం సడలించడం ద్వారా శ్వాస ప్రక్రియను సులభతరం చేస్తుంది. అల్లంను టీ, కషాయాలుగా లేదా ఆహారంలో తీసుకోవచ్చు. రోజూ కొద్ది మొత్తంలో అల్లం తినడం వల్ల ఊపిరితిత్తుల వాపు తగ్గుతుంది. ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అల్లంను పచ్చిగా కూడా తినవచ్చు.

**పసుపు**

పసుపులో లభించే కర్కుమిన్ అనే సమ్మేళనం సహజమైన శోథ నిరోధక కారకం. ఇది ఊపిరితిత్తుల లోపలి పొరను వాపు నుండి రక్షిస్తుంది. ఆస్తమా, బ్రోన్కైటిస్ వంటి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులలో ఉపశమనం కలిగిస్తుంది. పసుపును పాలు, కూరగాయలతో తీసుకోవచ్చు. పసుపును క్రమం తప్పకుండా తీసుకుంటే, అది ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది.


**వెల్లుల్లి**

ఇది ఔషధ గుణాలతో నిండి ఉంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీబయాటిక్, యాంటీవైరల్ లక్షణాలతో సమృద్ధిగా ఉంటుంది. ఇది శ్వాసకోశాన్ని తెరవడంలో సహాయపడుతుంది, మంటను తగ్గిస్తుంది. క్రిములతో పోరాడుతుంది. వెల్లుల్లిని పచ్చిగా నమలడం లేదా తేలికగా వేయించి తినడం ఊపిరితిత్తులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, శ్వాస ఆడకపోవుటలో ఇది తక్షణ ప్రభావాన్ని చూపుతుంది.

**సిట్రస్ పండ్లు**

చాలా సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. నారింజ, నిమ్మ, ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి ఊపిరితిత్తుల కణాలను రక్షిస్తుంది. ఈ పండ్లు శరీరంలో శ్లేష్మం ఏర్పడకుండా నిరోధిస్తాయి. శ్వాసకోశాన్ని శుభ్రంగా ఉంచుతాయి. ప్రతిరోజూ ఒకటి లేదా రెండు సిట్రస్ పండ్లను తినడం వల్ల మీ ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

## నాన్ వెజ్ తినలేని వారికి వరం ఈ గింజలు..
# తరచూ తింటే ఎన్నో లాభాలు..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం వ్యాయామం చేయడం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా తినాల్సి ఉంటుంది. కొందరు వ్యాయామం అయితే చేస్తారు కానీ అనారోగ్యకరమైన ఆహారాలను తింటారు. దీంతో వ్యాయామం చేసిన ఫలితం దక్కదు. కనుక ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం కూడా ముఖ్యమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇక అలాంటి ఆరోగ్యకరమైన శక్తినిచ్చే ఆహారాల్లో రాజ్మా గింజలు కూడా ఒకటి. ఇవి చిక్కుడు జాతికి చెందినవి. చూసేందుకు ముదురు గోధుమ రంగులో అచ్చం కిడ్నీల్లాగే ఉంటాయి. అందుకనే ఈ గింజలను కిడ్నీ బీన్స్ అని కూడా అంటారు. రాజ్మా గింజలను ఉత్తరాది వారు ఎక్కువగా తింటారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఈ గింజలను తినడం వల్ల శక్తి లభించడమే కాదు, పోషకాలను కూడా పొందవచ్చు. అలాగే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. రాజ్మాను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**అధికంగా ప్రోటీన్లు..**

రాజ్మా గింజల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా నాన్ వెజ్ తినలేని వారు ఈ గింజలను తింటే ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. దీని వల్ల శరీర కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. కండరాలు నిర్మాణమవుతాయి. కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఒక కప్పు రాజ్మా గింజలను తింటే చాలు మనకు రోజుకు కావల్సిన ప్రోటీన్లు మొత్తం లభిస్తాయి. అందువల్ల నాన్ వెజ్ తినలేని వారికి రాజ్మా గింజలు ఉత్తమ ఆహారం అని చెప్పవచ్చు. అలాగే శారీరక శ్రమ చేసేవారు, వ్యాయామం అధికంగా చేసే వారు సైతం ఈ గింజలను తినవచ్చు. దీంతో కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. కండరాలు నిర్మాణమవుతాయి. మళ్లీ ఉత్సాహంగా పనిచేసేందుకు కావల్సిన శక్తి లభిస్తుంది. చురుగ్గా ఉంటారు. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. బలహీనంగా ఉన్నవారు రాజ్మాను ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**మలబద్దకానికి చెక్..**


ఈ గింజలను తింటే ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీంతో పేగుల్లో మలం కదలికలు సులభతరం అవుతాయి. మలబద్దకం తగ్గుతుంది. ఈ గింజలు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ సైతం పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

**షుగర్ ఉన్నవారికి..**

రాజ్మా గింజల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ గింజలను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. పైగా ఈ గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక షుగర్ లెవల్స్‌ను తగ్గేందుకు దోహదం చేస్తుంది. రాజ్మాను తింటే శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ గింజల్లో ఫైబర్, పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. రక్త సరఫరా మెరుగుపడేలా చేస్తాయి. రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అధిక బరువు ఉన్నవారు ఈ గింజలను తింటే త్వరగా బరువు తగ్గుతారు. ఈ గింజల్లో ఉండే క్యాల్షియం ఎముకలను బలంగా మారుస్తుంది. ఇలా రాజ్మా గింజలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# గుండెపోటు అకస్మాత్తుగా రాదు..

**ఈ ముందస్తు హెచ్చరికలను మాత్రం విస్మరించొద్దు**



మరణాలు అందరినీ కలచివేస్తున్నాయి. పసిప్రాయం మొదలు నడివయస్సు వరకు పలువురు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. మరీముఖ్యంగా యువతే ఎక్కువగా గుండెపోటు బారిన పడి ప్రాణాలు వదులుతున్నారు. ఈ మధ్య నిత్యం ఇలాంటి ఘటనలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కరోనా తర్వాత యువగుండెకు ముప్పు వాటిల్లుతోంది. అప్పటివరకూ బాగానే ఉన్నవారు అంతలోనే ఉన్నచోటే కుప్పకూలి గుండెపోటుతో ప్రాణాలు వదులుతున్నారు. 2024లో భారత్‌లో హృదయ సంబంధిత మరణాలు ప్రధాన ఆరోగ్య సమస్యగా ఉన్నాయి. దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు గుండెపోటుతో మరణిస్తున్నారు. అయితే, గుండెపోటు ఆకస్మాత్తుగా సంభవించదని కొన్ని గంటలు, రోజులు, నెలలు, ఒక్కోసారి ఏడాది ముందే మన శరీరానికి హెచ్చరిక సంకేతాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఛాతీలో అసౌకర్యం, అలసట, అజీర్ణం వంటి తేలికపాటి లక్షణాలు గుండెపోటుకు హెచ్చరిక సంకేతాలుగా పేర్కొంటున్నారు. వాటిని ప్రజలు విస్మరించడం వల్లే చివరికి ప్రాణాలు వదులుతున్నారన్నారు. ఇలాంటి లక్షణాలు అనిపించినప్పుడే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక ఆకస్మిక గుండెపోటు సంభవించినప్పుడు ఛాతీలో తీవ్రమైన నొప్పి, అసౌకర్యం, ఊపిరి ఆడకపోవడం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కలినిపిస్తాయని నిపుణులు పేర్కొన్నారు. కొంతమందికి గుండెపోటుకు గురవడానికి కొన్ని రోజులు లేదా వారాల్లో అసాధారణ అలసట, ఛాతీలో అసౌకర్యం, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపించొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని ప్రోడ్రోమల్ లక్షణాలు అంటారు. ఈ లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించడం చాలా కష్టమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. లక్షణాలను గుర్తించి సకాలంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాద తీవ్రతను తగ్గించొచ్చని పేర్కొంటున్నారు. ఛాతీలో నొప్పి లేదా అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చేతులు, వీపు, మెడ, దవడ, కడుపులో నొప్పి లేదా అసౌకర్యం, తలనొప్పి లేదా తలతిరగడం, కోల్డ్ స్వెట్స్, వికారం లేదా వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# అస్త వ్యస్త ంగా ఎస్సీ గురుకులాల అడ్మిషన్ ప్రక్రియ



**పర్వతగిరి, ఆగస్టు 1( సమయం న్యూస్):**

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ గురుకులల్లో అడ్మిషన్ల ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉందని అనేక మంది విద్యార్థులను వారి తల్లి తండ్రులు ఆందోళనకు గురవుతున్నారని స్వేరోస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి కందికట్ల ప్రవీణ్ గారె జయరాజ్ లు విమర్శించారు. ఈమేరకు నిర్వహించిన పత్రికా విలేకరుల సమేవశం లో వారు మాట్లాడుతూ మొదట విడత గందరగోళంగా సీట్ల కేటాయింపు చేసి చాలా మంది విద్యార్థులు నష్టపోయేలా చేయడమే కాకుండా ప్రతి సంవత్సరం దూర ప్రాంతం లో సీటు వచ్చిన విద్యార్థుల కొరకు చేపట్టే మ్యూచువల్ ట్రాన్స్ఫర్ ప్రక్రియ ను సంక్రమంగా పూర్తి చేయకుండానే స్పాట్ అడ్మిషన్ లు నిర్వహించడమేంటని ప్రశ్నించారు? దూర ప్రాంతాల్లో సీటు వచ్చిన విద్యార్థు లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థుల మరియు వారి తల్లిదండ్రుల విన్నపాలను కనీసం పట్టించుకునే అధికారులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతం లో ఎన్నడు లేని విధంగా ఈ విద్యా సంవత్సరము ఎస్సీ గురుకులల్లో అనుసరిస్తున్న వింత పోకడలపై ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు బాధ్యులైన అధికారులను ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన ఆలోచించే అధికారులు లేనందువలననే ఇలాంటి దుస్తితి ఏర్పడిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్సీ గురుకులాల్లో పరిస్థితిని చక్క దిద్దాలని కోరారు. ఈ సమావేశంలో స్వేరో నాయకులు బానోత్ రమేష్, దినేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ లో చేరిన సీనియర్ నాయకులు

**శేరిలింగంపల్లి ఆగస్టు 1 (సమయం న్యూస్):**

గచ్చిబౌలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె పు సురేంద్ర అధ్యక్షతన కేశవ్ నగర్ కు చెందిన పలు పార్టీలకు సంబంధించినటువంటి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లోనికి చేరడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా నూతనంగా పార్టీలోకి చేరిన వారిని కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీ లోనికి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జెరిపేటి రామచంద్ర రాజు, రాజేంద్ర, కవి రాజ, మారెళ్ళ శ్రీనివాస్, రామచంద్ర, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి అడ్లూరిని కలిసిన నాయకులు

**వరంగల్ , ఆగస్టు 1( సమయం న్యూస్):**

హైదరాబాదులో సంక్షేమ గిరిజన మైనార్టీ శాఖ మంత్రివర్యులు అడ్లూ ర్ లక్ష్మణ్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిసిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. మాజీ శాసనసభ్యులు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు..



## వరంగల్ సిటీ టెంపుల్స్ లోగో ఆవిష్కరణ

**వరంగల్ , ఆగస్టు 1( సమయం న్యూస్):**

వరంగల్ జిల్లా దేవాదయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్, భద్రకాళి దేవస్థానం ఈవో ఆర్. సునీతను సమయం న్యూస్ రిపోర్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరికృష్ణ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న warangal_city_temples ఇన్స్టాగ్రామ్ పేజీ లోగోను సునీత చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కంచర్ల శివకుమార్, కర్రె రవి, రాచర్ల భద్రయ్య పాల్గొన్నారు.



# కుర్మ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**వికారాబాద్ ఆగస్టు 1( సమయం న్యూస్):**

వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని బిల్లదాకల లో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించే కుర్మ సంఘం భవనానికి ఈరోజు శంకుస్థాపన చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు. పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మాజీ ఎమ్మెల్సీ, కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం, గొర్రె కాపరుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సదానందం, కుర్మ సంఘం నాయకులు, ప్రతినిధులు.ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు కుర్మ సంఘం భవన నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల నుంచి కోటి రూపాయలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

## రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలి



**రాయపోల్,ఆగస్టు1:** రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు కేటాయించాలని భాజపా మండల అధ్యక్షుడు మంకిడి స్వామి అన్నారు. శుక్రవారం రాయపోలు మండలం వడ్డేపల్లి సమీపంలోని గుర్రాల సోఫా వద్ద గజ్వేల్ చేగుంట రోడ్డు పై రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని భాజపా నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాజీవ్ యువ వికాసం పథకం కోసం మీ సేవలో చిత్తూర్ తిరిగి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, యువతకు మాత్రం నిరాశే మిగిలిందన్నారు. ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకున్న యువతకు రాజీవ్ వికాసం ద్వారా లోన్లు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే ఇండ్లు కట్టు కుంటున్న వారికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందజేస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇసుకను ఉచితంగా అందించి ఆదుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న యువతకు లోన్లు ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, భాజపా మాజీ అధ్యక్షులు రాజా గౌడ్, ఉపాధ్యక్షుడు నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుపై ప్రయాణమేల

**పటాన్ చెరు(జిన్నారం) ఆగస్టు 1, సమయం న్యూస్ :**

గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు జిన్నారం మండలం శివానగర్ గ్రామం నుండి పటాన్ చెరు కు వెళ్లేదారి సుమారు రెండు కిలోమీటర్లు పూర్తి గుంతల మయంగా మారింది. ఊట్ల, సోలక్ పల్లి, రాళ్లకత్వ, రాళ్లకత్వ తాండ వాసులు నిత్యం వివిధ పనుల పైన ఈ దారి వెంట ప్రయాణం చేయవలసి వస్తుంది. ఈ రోడ్డు వెంట ప్రతినిత్యం కంకర ట్రిప్పర్ లారీలు వందల సంఖ్యలో తిరగడం వల్ల రోడ్డు పూర్తిగా అద్వాన్న స్థితికి మారింది.ఈ రోడ్డుపై ప్రయాణించిన ప్రయాణికులు చాలా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై కార్లు, మోటార్ సైకిల్ తో ప్రయాణిస్తే ప్రమాదంతో చెలగాటమాడినట్లేనని ప్రయాణికులు అన్నారు. ఇట్టి విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు తెలియజేసిన ఫలితం మాత్రం శూన్యంగా ఉందని వారు వాపోయారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.





## మడేలయ్య స్వామి దర్శనం

**వరంగల్ , ఆగస్టు 1( సమయం న్యూస్):**

రంగశాయిపేటలో గల రజకుల ఇలవేల్పు అయిన మడేలయ్య స్వామి వారి శ్రావణమాసం బోనాల సందర్భంగా ఈరోజు స్వామివారిని దర్శించుకుని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మరియు గ్రామం అభివృద్ధి దిశలో ముందుకు పోవాలని స్వామివారిని ప్రార్థించారు.



# గ్యాస్ సబ్సిడీ కోసం ఎదురు చూపులు

- ఎమ్మెల్యే సునీత రెడ్డి

**వెల్దుర్తి ఆగస్టు 01, (సమయం న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద అర్హులైన పేదలకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని, అలాగే ఏ పథకాల లో ఎంపిక కావాలన్నా ప్రభుత్వ పథకాల పొందాలన్నా,మరియు వైద్యం విషయంలో కానీ చదువు విషయంలో కానీ రేషన్ కార్డు ప్రామాణికం అన్నారు. కాబట్టి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు తెలియ జేశారు..గత ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల కాలంలో దాదాపు 6,47,479 లక్షల మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేయడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన కానీ ఇప్పటికీ చాలా గ్రామాల్లో గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడడం లేదని, మరియు మహాలక్ష్మి స్కీం కింద ఇస్తానన్న మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇప్పటికీ ఒక్క మహిళకు కూడా ఇవ్వలేకపోయారని, వెంటనే ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయలు ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో రెండు లక్షలకు పైన ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదని, కాబట్టి ఆ టెక్నికల్ సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షా కాలం వంట నాట్లు పూర్తవుతున్న దశలో యూరి యా కోసం రైతులు ఇబ్బంది పడకుండా అన్ని కేంద్రాలలో యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు మేలు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.



## కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వసతులు కల్పించండి

- దేవాదాయ శాఖ కమిషనర్ కు వినతి పత్రం
- పట్ట భద్రుల ఎమ్మెల్సీ డాక్ట ర్ సి అంజి రెడ్డి

**పటాన్ చెరు,ఆగస్టు 1, సమయం న్యూస్ ;**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వసతులు కల్పించాలని దేవాదాయ శాఖ కమిషనర్ కు, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ సి అంజిరెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాం ట్రాక్టు బేసిన్ లో పని చేస్తున్న ఉద్యోగులకు పూజారులకు కనీస వేతనాలు చెల్లించాలని ఆయన అన్నారు. వారికి ఈఎస్ఐ, పిఎఫ్ సేవలను కల్పించాలని ఆయన కోరారు. ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవన్ జ్యోతి యోజన, ఎస్బిఐ లైఫ్ లాంటి ఇన్సూరెన్సులు కల్పిం చాలని కమిషనర్ కోరినట్లు తెలిపారు. దేవాలయాలలో వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, సంప్ర దాయ దుస్తుల లోనే దర్శనాలకు వీలు కల్పించడం లాంటి విషయాలలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని కమిషనర్ కు సూచించినట్లు తెలిపారు. అతి విషయాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు

**శివంపేట్ ఆగస్టు 1 (సమయం న్యూస్ ):** శివంపేట కేంద్రాలలో మొదటిరోజు భాగంగా శివంపేట్ అంగన్వాడి కేంద్రం 2, గోమారం సెక్టార్ పరిధిలోని ఉసిరికపల్లి తండా అంగన్వాడి లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. సూపర్వైజర్ సంతోష, వసుమతి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ కి పుట్టబోయే బిడ్డ కోసం తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలియపరచడం జరిగింది. ప్రతి బిడ్డకు పుట్టగానే ముర్రుపాలు పట్టించాలని అదనపు పోతపాలు పట్టవద్దని తెలిపారు.అనంతరం బాలింత గృహ సందర్శన చేసి బాలింత జాగ్రత్తలు మరియు పిల్లల సంరక్షణ ఏ విధంగా చేసుకోవాలో తెలియవ పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివంపేట, భీమ్లా తండా పంచాయతీ కార్యదర్శి అంగన్వాడీ టీచర్లు తల్లు లు పిల్ల లు పాల్గొన్నారు





## గొర్రెలలో వ్యాధి నివారణకు టీకాలు వేయించడమే ప్రధానం

**సంగారెడ్డి ఆగస్టు 1(సమయం న్యూస్):**

.ముందస్తు చర్యలే గొర్రెల ప్రాణాలను కాపాడుతాయని వ్యాధుల నివారణకి టీకాలు ప్రధాన సాధనమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డి మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గొర్రెలలో వచ్చే నీలి నాలుక వ్యాధి వల్ల గొర్రెలకాపరులు తీవ్రంగా నష్టపోతున్నారని గొర్రెల లో నీలి నాలుక వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడం కోసం ప్రభుత్వం గొర్రెలకు కు ఉచితంగా నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నదని గొర్రెల పెంపకం దారులకు సూచించారు. నీలి నాలుక వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన గొర్రెలకు జ్వరం రావడం నోరు వాచి నీరు వదలడం లాంటి లక్షణాలతో గొర్రెలు చివరికి మరణించడంతో గొర్రెల పెంపకం దారులు తీవ్రంగా నష్టపోతున్నారని అలాంటి సమ స్యలు ఉత్పన్నం కాకుండా ఉండడం కోసం ప్రభుత్వం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గొర్రెల పెంపకం దారులు . సకాలంలో తమ గొర్రెలకు నీలి నాలుక వ్యాధి టీకాలు వేయించడం వల్ల వ్యాధి నుండి తమ గొర్రెలకు రక్షణ కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి గ్రామంలో పదిమంది గొర్రెల కాపరులకు చెందిన 900 గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అధికారులకు సూచించారు. గొర్రెల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి వసంతకుమారి, పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**మహబూబ్ నగర్, ఆగస్టు 1:**

డెంగ్యూ, మలేరియా, చికన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ పట్టణంలోని సుభాష్ నగర్ వార్డ్ నంబర్ 47 లో ఇంటింటా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డెంగ్యూ సోకిన బాలికను కలెక్టర్ పరామర్శించారు. ఆమె పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చికిత్స తీసుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు బాలిక వివరించింది. అనంతరం బాలిక ఇంటి పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. వినియోగించని వాష్‌రూమ్‌లలో చెత్త, నిల్వ నీరు ఉండటాన్ని గమనించిన కలెక్టర్, వాటిని తక్షణం తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ను ఆదేశించారు. ప్రజలతో మాట్లాడుతూ కలెక్టర్ మాట్లా డుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి లోపల, బయట దోమలు పెరిగే పరిస్థితులు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య, శానిటేషన్ సిబ్బంది అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నెలాఖరు వరకు కాటేజీలు పూర్తి చేయండి

**మెదక్, ఆగస్టు 1:**

నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో కాటేజీల నిర్మాణాలను ఈ నెలాఖరు వరకు పూర్తి చేసి యాత్రికుల వినియోగానికి అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లో నిర్వహించిన పర్యటన సందర్భంగా అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను సందర్శించి కాటేజీల పనులను అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో యాత్రికుల సౌకర్యార్థం 42 కాటేజీల నిర్మాణాన్ని చేపట్టామని, ప్రస్తుతం 22 కాటేజీలు చివరి దశలో ఉండగా, ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి ముఖ్య అతిథులచే ప్రారంభించి యాత్రికులకు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా ఉండటంతో సెలవు దినాల్లో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన యాత్రికులు ఆనందంగా గడిపేలా అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కా టేజీల నిర్మాణం పూర్తయిన తరువాత పార్క్ మరింత ఆకర్షణీయంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి

- **జిల్లా అదనపు కలెక్ట ర్ సౌరభ్ శర్మ**

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 1(సమయం న్యూస్) :**



శుక్రవారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు 2025 గోడ పత్రికలను జిల్లా అదనపు కలెక్టర్ సౌరభ్ శర్మ ఆవిష్కరించారు . ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్ట ర్ సౌరభ్ శర్మ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది అని, ఈ సందర్భంగా జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు, తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని పుట్టిన ప్రతి బిడ్డకు మొదటి గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు పట్టాలని, అలాగే బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం అని, దీనిని ప్రతి తల్లి పాటిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బంది, ఆశాలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలు, డి ఆర్ డి ఏ, లైన్ డిపార్ట్మెంట్లు సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సౌరభ్ శర్మ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ని ఆవిష్కరించి వారం రోజుల షెడ్యూల్ను విడుదల చేయడం జరిగింది. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏ రోజు ఏం చేయనున్నారు దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 1న ప్రతి అంగనవాడి కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. ఇందులో తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తారు, రెండవ తేదీన ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతను తల్లులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు, నాలుగో తేదీన అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించి అంగనవాడి టీచర్స్, ఆశా వర్కర్లు బ్రెస్ట్ ఫీడింగ్ పై అవగాహన కల్పిస్తారు. ఐదో తేదీన ఇంటింటికి వెళ్లి తల్లి పాల ప్రాధాన్యతపై ప్రచారం చేస్తారు, 6న చేతులను శుభ్రం చేసుకునే అంశంపై అవగాహన కల్పిస్తారు. ఏడోవ తేదిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా, సెర్ఫ్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, బ్రెస్ట్ ఫీడింగ్ పై విస్తృత అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయలక్ష్మి , సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పి.సంపత్, సూపర్వైజర్ రమా దేవి పోషణ అభియాన్ జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ బి. రాము, బ్లాక్ కోఆర్డినేటర్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలి



- **జిల్లా కలెక్ట ర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ ఆగస్టు 1(సమయం న్యూస్):**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి.బి గ్రామంలోని డిసిఎంఎస్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణంలో ఏర్పాటు చేసిన స్టాక్ బోర్డును పరిశీలించారు. తప్ప కుండా ప్రతిరోజు రైతులకు ఎరువుల దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా ఇతర ఎరువుల వివరాలు అర్థమయ్యేలా స్పష్టంగా స్టాక్ బోర్డులను ప్రదర్శించాలన్నారు. ఎరువులు అమ్మకానికి సంబం ధించి రసీదులను తనిఖీ చేశారు. అన్ని రసీదులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఎట్టి పరిస్థితు ల్లోనూ నకిలీ, గడువు తీరిన ఎరువులను విక్రయించ వద్దని హెచ్చరించారు. గ్రామానికి చెందిన పలు వురు రైతులతో మాట్లా డుతూ, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారికి అవసరమైన ఎరువుల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఫర్టిలైజర్ దుకాణాలలో అన్ని పంటలకు సరిపడిన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని వారికి చెప్పా రు. ఎరువుల విషయంలో రైతులు ఎటువంటి ఆందో ళన చెందనవసరం లేదని అన్నారు. పంటలకు అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులను వేయాలన్నారు. అధిక యూరియా వేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందనేది అపోహ మాత్రమే అని చెప్పారు. అధిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందని వివరించారు. అనంతరం సారంగాపూర్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలోని స్టాక్ బోర్డును పరిశీలించారు. యూరియా, డిఏపి అమ్మకాలకు సంబంధించిన రసీదులను పరిశీలించి, ప్రతి అమ్మకానికి సంబంధించిన రసీదును సంబంధిత రైతుకు కచ్చితంగా అందించాలని అన్నారు. పురుగుల మందు లేబుళ్లను పరిశీలించి, గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసే పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని అన్నారు. గడువు తీరిన, నకిలీ మందులను విక్రయించవద్దని అన్నారు. సంబంధిత అధికారులు అంతా ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర స్టేట్ వాటర్ పోలో జట్టు కు అనిరుధ్ ఎంపిక

**హైదరాబాద్ ఆగస్టు 1(సమయం న్యూస్) :**

తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టుకు ఎల్. అనిరుధ్ ఎంపికయ్యాడు. అనిరుధ్ కు రాష్ట్ర జట్టులో చోటు లంబించడం పట్ల హైదరాబాద్ స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి గిరిధర్ రావు , స్ట్రోక్స్ స్విమ్మింగ్ స్కూల్ యజమాని చెరుకూరి భరత్ , ప్రధాన కోచ్ ,తెలంగాణ స్టేట్ వాటర్ పోలో టీం మేనేజర్ ముక్తార్ అహ్మద్ , అనిరుధ్ ను అభినందించారు. ఈనెల 4వ తేదీ నుంచి 8వరకు బెంగుళూరు కర్ణాటక లో జరగనున్న 51వ జూనియర్స్ నేషనల్స్ అక్వాటిక్ ఛాంపియన్షిప్ 2025 లో వాటర్ పోలో గేమ్ లో ఎల్ . అనిరుధ్ తెలంగాణ కు ప్రాతినిధ్యం వహించనున్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు

**నిజామాబాద్, ఆగస్టు 1:**



భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో తాత్సారం అనర్థకమని, ప్రతి దరఖాస్తును వేగంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం నవీపేట్ మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ఈ విషయాన్ని ఆయన అన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ప్రతి గ్రామానికి సంబంధించిన దరఖాస్తులు ఏమాత్రం పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంపై నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు, వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్, ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. సీహెచ్సీ నిర్వహణ, సదుపాయాలను పరిశీలించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, రౌండ్ ది క్లాక్ సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. గర్భిణీల పరీక్షలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను 100% పూర్తి చేయాలని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసి పరిశుభ్రత పాటించాలన్నారు. దర్యాపూర్ పాఠశాల ఆవరణంలో చెత్తాచెదారం కనిపించడంతో వెంటనే శుభ్రపరిచేలా పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎరువుల గోడౌన్‌లలో నిల్వలను పరిశీలించిన కలెక్టర్, రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విక్రయ కేంద్రాల్లో స్టాక్ బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. పశువైద్యశాలలో పశుగ్రాసం విత్తనాల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు ఎలా అందిస్తున్నారో ఆరా తీశారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకట రమణ, ఏఓ నవీన్, వెటర్నరీ డాక్టర్ బి.నరేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత లక్ష్యాల సాధనకు అంకిత భావంతో కృషి చేయాలి

## కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి





**నిజామాబాద్, ఆగస్టు 01( సమయం న్యూస్):** నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఒక్కో మండలం వారీగా చర్చిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపు, ఆయిల్ పాం సాగు, ఎరువుల పంపిణీ, వన మహోత్సవం, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, ఆహార భద్రత కార్డులు, గ్రామీణ అభివృద్ధి, నీటి పారుదల, తాగునీటి సరఫరా, ఖరీఫ్ సాగు, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, విద్యుత్ సరఫరా, రోడ్లు-భవనాలు, విద్య, వైద్యం, భారీ వర్షాలు కురిసిన సమయాలలో చేపట్టాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు సజావుగా జరిగేలా సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టళ్ళు, అంగన్వాడి, ఆసుపత్రులు వంటి వాటికి సంబంధించిన అసంపూర్తి భవనాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నచిన్న కారణాల వల్ల పనులు పెండింగ్ లో ఉండకూడదని, ఒక్కో శాఖ వారీగా మండల స్పెషల్ ఆఫీసర్ లు దృష్టిని కేంద్రీకరిస్తే, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ బడులలో ఇంకనూ అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను గుర్తిస్తూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రతిపాదనలు సమర్పించేలా చూడాలన్నారు. మండల వనరుల కేంద్రం భవనాల నిర్మాణాల కోసం ఇప్పటికే స్థల కేటాయింపులు పూర్తయిన చోట పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాధాన్యత కలిగిన పనులను వేగవంతంగా జరిపించాలని, అదే సమయంలో నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరీలు పొందిన లబ్దిదారులు అందరూ ఇంటి నిర్మాణం పనులను ప్రారంభించేలా ప్రోత్సహించాలని అన్నారు. జిల్లాలో వానాకాలం పంట సాగుకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే అన్ని ప్రాంతాలలో యూరియా, ఇతర ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. అన్ని విక్రయ కేంద్రాలు, గోడౌన్ ల వద్ద ఎరువుల నిల్వల వివరాలతో కూడిన స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా ఎరువులు పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలని అన్నారు. ఎక్కడైనా ఎరువులను దారి మళ్లిస్తే రైతులు, ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించాలని అన్నారు. పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా అనునిత్యం పర్యవేక్షణ జరపాలని సూచించారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అయినందున, కొత్త కార్డుల కోసం, సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటదివెంట పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలపై దృష్టి పెట్టాలి

## • జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 01:( సమయం న్యూస్):** ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాల అందించడం పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో మెరుగైన విద్య అమలు పై రామగుండం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల పై ఉపాధ్యాయుల నుంచి సలహాలు సూచనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలో ప్రతి రోజు పిల్లల కు ఏఐ ల్యాబ్ లో కనీసం 20 నిమిషాలు హాజరయ్యే విధంగా షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థి ప్రమాణాలు పెంచేందుకు ఏఐ టూల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి పాఠశాలలో 30 శాతం విద్యార్థులు చురుగ్గా ఉంటారని, కొంచెం ఉపాధ్యాయులు శ్రద్ధ పెడితే మరో 40 శాతం విద్యార్థులు సైతం బాగా చదువుతారని, మిగిలిన 30 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడం చాలెంజ్ గా తీసుకుని ఉపాధ్యాయులు పని చేయాలని, చివరి విద్యార్థి వరకు మనం చెప్పే పాఠాలు అర్థాలు కావాలని అన్నారు. తరగతి గదిలో బోధన లో పిల్లలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి అన్ అకాడమీ పనులు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు 3 నెలలో పూర్తి చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్.ఆర్.ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. ఎఫ్.ఆర్.ఎస్ విధానం వల్ల ఉపాధ్యాయుల చాలా వరకు పని భారం తగ్గుతుందని అన్నారు .పాఠశాల సంబంధించి సంపూర్ణ వివరాలు యూ.ఐ.డి.సి పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. విద్యార్థులు వర్క్ బుక్ ఉపయోగించేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు కంప్రహెన్షన్ స్కిల్ వస్తే గణితం సైన్స్ సోషల్ బాగా అర్థం చేసుకుంటారని, బేసిక్ విద్యా ప్రమాణాల పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సబ్సిడీ గ్యాస్ పథకంతో పేదలకు తగ్గిన భారం



**భూపాలపల్లి ఆగస్టు1( సమయం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అమలవుతున్న మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్‌ను రూ.500కి అందించే పథకం అనేక నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు కలిగిస్తోంది. ఈ పథకంలో భాగంగా జిల్లాలో మొత్తం 2,36,243 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయబడి, మొత్తం రూ. 655.19 లక్షల సబ్సిడీ మంజూరైంది. ఇది జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఆదా జరిగింది. ప్రత్యేకంగా రేగొండ మండలంలో అత్యధికంగా 12292 కుటుంబాలకు ఇప్పటి వరకు 41,459 సిలిండర్లు పంపిణీ చేయడం ద్వారా రూ. 121.36 లక్షల సబ్సిడీ అందించడం ద్వారా ఈ మండలం ఆదర్శంగా నిలుస్తోంది. ఇదే విధంగా భూపాలపల్లి మండలంలో 6487 మంది లబ్ధిదారులకు 23,696 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 65.19 లక్షలు, మహా ముత్తారం మండలంలో 3988 మంది లబ్ధిదారులకు 12193 సిలెండర్లు అందించడం ద్వారా 18.57.లక్షలు, మల్హార్ రావు మండలంలో 5340 మంది లబ్దిదారులకు 20628 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 58.70 లక్షలు, ఘనపూర్ మండలంలో 5798 మంది లబ్ది దారులకు 20822 మంది సిలెండర్లు ఇవ్వడం ద్వారా 64.26 లక్షలు, టేకుమట్ల మండలంలో 4286 మంది లబ్ధిదారులకు 13574 మంది లబ్దిదారులకు 40.69 లక్షలు, మొగుళ్లపల్లి మండలంలో 5981 మంది లబ్ధిదారులకు19112 మంది లబ్దిదారులకు 59.08 లక్షలు, కాటారం మండలాల్లో 6550 మంది లబ్దిదారులకు 21619 సిలెండర్లు సరఫరా చేయడం ద్వారా 52.59 లక్షలు, మహాదేవపూర్ మండలంలో 5063 మంది లబ్ధిదారులకు18008 సిలెండర్లు సరఫరా చేయడం ద్వారా 47.48 లక్షలు, పలిమెల మండలంలో 898 మంది లబ్దిదారులకు 1650 సిలెండర్లు 2.28 లక్షలు, చిట్యాల. మండలంలో 6111 మంది కుటుంబాలకు 19557 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 57.12 లక్షలు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 5290 కుటుంబాలకు 23925 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 67.87.లక్షలు మొత్తం 655.19 లక్షలు 500 లకే సబ్సిడీపై గ్యాస్ సౌకర్యం అందించబడింది. పేద మహిళలు వంటలో కట్టెల పొయ్యి సమస్యల నుంచి విముక్తి పొందుతున్నారు. వంటకు గ్యాస్ సదుపాయం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు సమయాన్ని కూడా ఆదా చేసుకోగలుగుతున్నారు. ఈ పథకంతో ఊరూరా పేద మహిళల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది ఇప్పటికే రెండు మూడు సార్లు గ్యాస్ సబ్సిడీ ఉపయోగించుకున్నా ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ గ్యాస్ పథకం మహాలక్ష్మి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని లబ్ధిదారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో ఈ పథకం విజయవంతంగా అమలవుతోంది. ప్రతి మండలంలో లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం నిబద్ధతతో పని చేస్తోంది. ప్రజా పాలన పథకం ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి గొప్ప పథకంగా ఈ పథకం ఆదర్శంగా నిలిచింది.



# స్పోర్ట్స్ కాంక్లేవ్‌కు సర్వం సిద్ధం

## అధికారికంగా తెలంగాణ క్రీడా విధానం ప్రకటన

## హాజరుకానున్న సీఎం రేవంత్ పలువురు క్రీడా సెలబ్రిటీలు

## పలు క్రీడా సంస్థలతో ఎంవోయూలు

**హైదరాబాద్ ఆగస్టు1( సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్ ఐ సి సి, నోవాటేల్ లో రేపు నిర్వహించనున్న స్పోర్ట్స్ కాంక్లేవ్ కు సర్వం సిద్ధమైంది. తెలంగాణ క్రీడా విధానం 2025ను యావత్ క్రీడా సమాజానికి విస్తృత స్థాయిలో పరిచయం చేసేందుకు, క్రీడా విధానం అమలులో అందరి భాగస్వామ్యం పెంచేందుకు ఉద్దేశించిన ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ కు కావలసిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రఖ్యాత క్రీడా విశ్లేషకులు చారు శర్మ, భారత క్రికెట్ మాజీ ఒలంపియన్లు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్,అంజు జార్జ్ వివిధ క్రీడా ఫెడరేషన్ల ప్రతినిధులు క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రముఖ క్రీడా జర్నలిస్టులు విశ్వనాథన్ సభ నాయక్ తోపాటు మరి కొంతమంది సీనియర్ క్రీడా జర్నలిస్టులు తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ఈ విధానం ప్రధానంగా పటిష్టమైన క్రీడా పరిపాలన, దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి, కెరియర్ మరియు ఉపాధి మార్గాల రూపకల్పన, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర క్రీడా వాతావరణ కల్పన వంటి అంశాలపై దృష్టి సారించనుంది. గత ఏడాది కాలం నుండి సీఎం రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు ఒక సమగ్రమైన పటిష్టమైన క్రీడా విధానం తీసుకురావాలన్న సంకల్పంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఎంతో కృషి చేసింది. FIFA వంటి గ్లోబల్ క్రీడా సంస్థలతో పాటు ప్రముఖ కార్పొరేట్లు, క్రీడా నిపుణులతో రాష్ట్రం ఎంవోయూస్ చేసుకుంటోంది

### ఇది ఆరంభం మాత్రమే

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలకు ఇది ఆరంభము మాత్రమేనని స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. రేపటి కార్యక్రమాలకు జరుగుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక జాతీయ అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే సత్తా ఉందని అనేకసార్లు నిరూపించబడిందని క్రీడా శాఖ అధికారుల శ్రమ, రాష్ట్ర ప్రభుత్వ సహకారం, సీఎం రేవంత్ గారి పట్టుదల కలసి తెలంగాణ నూతన క్రీడా విధానం 2025 రూపు దిద్దుకుందని ప్రకటించిన క్రీడా విధానం మెరుగ్గా అమలు పరచడానికి, దీనిని జాతీయస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి వివిధ క్రీడా కార్యక్రమాలలో అందరినీ భాగస్వామ్యం చేయడానికి జాతీయస్థాయిలో మద్దతు కూడగట్టడానికి ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ ముఖ్య ఉద్దేశమని శివసేన రెడ్డి అన్నారు.

# కొత్త రేషన్ కార్డుల అందజేత



**ఇంద్రవెల్లి ఆగస్టు1( సమయం న్యూస్):** ఇంద్రవెల్లి మండలం అంజి రోడ్ లోని కాగానే ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఖానాపూర్ నియోజకవర్గం ఇంద్రవెల్లిలో దాదాపు 9 వేల, సిరికొండ 251, మండలాల అర్హులైన లబ్ధిదారులకు ప్రజా పాలన ప్రగతి బాట ఆహార భద్రత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో లబ్దిదారులకు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు. అనంతరం కూరగాయల విత్తనాల ప్యాకెట్స్‌ను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బు గుప్తా, లైబ్రరీ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ ఛైర్మెన్ ఆర్డీవో స్రవంతి, %వీ=ా% ఎంపిడిఓ,, రెవెన్యూ , పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

**పెద్దపల్లి ఆగస్టు1( సమయం న్యూస్):** పెద్దపల్లి జిల్లా లో గల సామజిక ఆసుపత్రి, మంథని లో ఖాళీగా వున్నా సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) (2) పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయుటకు తేది 05-08-2025, మంగళవారం రోజున ఉదయం 11.00 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ గారి కార్యాలయములో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించబడును. ఆసక్తి గల వైద్యులు వారి యొక్క దరఖాస్తు / బయోడేటాతో పాటుగా వారి యొక్క అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్ లతో పాటుగా జిరాక్సు ప్రతులు ఒక్క సెట్ తో హాజరు కాగలరు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ వేతనము రూ. 52,351/- అని డా. కె. శ్రీధర్, జిల్లా సూపరింటెండెంట్ గారు తెలియచేసారు. మిగతా వివరాలకు 8499061999/9491481481 ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యువ వికాస్ కార్యక్రమం

### విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం

**నల్గొండ, ఆగస్ట్ 1(సమయం న్యూస్ ):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ వికాస్ కార్యక్రమంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కోసం స్ఫూర్తిదాయక సందేశాలు అందించారు. రీజనల్ ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్ మోటివేషనల్ స్పీకర్‌గా పాల్గొని, విద్యార్థుల లక్ష్య సాధన, మంచి అలవాట్ల పెంపొందింపు, మరియు సెల్‌ఫోన్ వినియోగంలో సమతుల్యతపై విలువైన సలహాలు అందించారు. కార్యక్రమంలో సాయికిరణ్ మాట్లాడుతూ, “విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవాలి. క్రమశిక్షణ, సమయ పాలన, మరియు మంచి అలవాట్లు విజయానికి మూలస్తంభాలు. సెల్‌ఫోన్‌ను అవసరానికి మాత్రమే ఉపయోగించి, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండటం ద్వారా ఏకాగ్రతను పెంచుకోవచ్చు” అని సూచించారు. రోజువారీ జీవనంలో సానుకూల దృక్పథం, ఆరోగ్యకరమైన జీవనశైలి, మరియు నిరంతర అభ్యాసం యువత భవిష్యత్తును రూపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ కలలను సాకారం చేసుకోవడానికి అవసరమైన దిశానిర్దేశం పొందారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమం ద్వారా యువతలో సామాజిక బాధ్యత, నీతి విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి: ఏడుగురి అరెస్టు



**కంగ్టి ,1 ఆగష్టు,(సమయం న్యూస్) :** గురువారం అర్ధరాత్రి 12 గంటలకు కంగ్టి మండలం భీమ్రా గ్రామంలో గంగూశెట్టి కిరాణా షాపు ముందు పేకాట ఆడుతున్నారు అని నమ్మదగిన సమచారం రావడంతో వెంటనే కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి,కంగ్టి ఎస్సై దుర్గారెడ్డి, మరియు సిబ్బంది కలిసి రైడ్ చేయగా 7 మంది పేకాట ఆడుతుండగా వారిని పట్టుకోవడం జరిగింది.వారి వద్ద మొత్తం 9260/- రూపాయలు సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది. తర్వాత వారిని కోర్టులో ప్రవేశ పెట్టడం జరుగుతోంది అని సిఐ వెంకట్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కంగ్టి మండలంలో ఎవరైన పేకాట ఆడితే -8712656734,8712656760 నంబర్లకు సమాచారం ఇవ్వండి.వారి వివరాలు గోప్యంగా ఉంచబడును. పేకాట ఆడడం వల్ల సంసారాలు నాశనం అవుతాయి,అప్పుల పాలు అవుతారు, అది ఒక వ్యసనంగా మారి తాగుడుకు బానిస అవుతారు,కావున ఎవరన్నా పేకాట అడుతే తాట తీస్తాం,ఎవరైన సరే ఉరుకునే ప్రసక్తే లేదు అని కంగ్టి సిఐ తెలియజేశారు.

## మున్సిపాలిటీలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



**పటాన్ చెరు(జిన్నారం),ఆగస్టు1, సమయం న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 61వ రోజు బొల్లారం మున్సిపాలిటీలో వివిధ పార్టీలో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ బి కిషన్ పర్యవేక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ కాలనీలలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో, సీజనల్ వ్యాధులు అరికట్టడానికి అవసరమైన అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. మున్సిపల్ వార్డు ఆఫీసర్స్ నిర్వహిస్తున్న భువన్ సర్వే జియో టాకింగ్ సర్వే పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి కిషన్, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, మున్సిపల్ ఏఈ, రెవెన్యూ ఆఫీసర్ మేనేజర్, వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నవీన్ గుప్తా జన్మదిన వేడుకలు

**శివంపేట ఆగష్టు 1 (సమయం న్యూస్):** శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త జన్మదిన సందర్భంగా పిఎన్జి యువసేన ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలుకుతూ పులిమామిడి నవీన్ గుప్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు , కార్యకర్తలు భారీ ఎత్తున జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.



# శ్రీ చైతన్య తరగతుల కొనసాగింపు చట్ట విరుద్ధం

- గుర్తింపు లేని పాఠశాలపై అధికారుల ఆదేశాలు బేఖాతరు
- మాకేం వర్తించవు అంటూ విద్యావ్యవస్థకే సవాలు
- ఏం చేసుకుంటారో చేసుకోండి అనే విధంగా ప్రవర్తన




**బాన్సువాడ: గతంలోనే గుర్తింపు తిరస్కరించబడిన కార్పొరేట్ విద్యా సంస్థ శ్రీ చైతన్య హైస్కూల్, కోర్టు ఆదేశాలను మరియు ప్రభుత్వ నిబంధనలను నిర్లక్ష్యం చేస్తూ, ఇప్పటికీ తరగతులను నిర్విరామంగా నిర్వహించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, నిరుద్యోగ సంఘాలు ఈ వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.**

### గుర్తింపు తిరస్కరణ

విద్యాశాఖ జూన్ 6న సరైన ధ్రువ పత్రాలు సకాలంలో ఆన్ లైన్ లో చూపించక పోవడం ,తదితర కారణాలతో ఈ పాఠశాలకు గుర్తింపు నిరాకరించబడింది. పునఃపరిశీలన కోసం కోర్టును ఆశ్రయించినా, గుర్తింపు మంజూరవలేదు.

### కోర్టు ఆదేశాలను పట్టించుకోని వ్యవహారం..

డీఈవో కార్యాలయం తరపున తరగతులు నిర్వహించకూడదు స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కూడా, ఈ పాఠశాల తరగతులను నిర్వహిస్తోంది. ఇది న్యాయవ్యవస్థపై అవమానకర ధోరణిని సూచిస్తోంది. అధికారుల మౌనం వల్ల ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దెబ్బతింటోంది.

### ట్యూషన్ పేరుతో తరగతుల నిర్వహణ

పాఠశాల యాజమాన్యం తరగతుల నిర్వహణపై ప్రశ్నించగా, “ఇవి ట్యూషన్ క్లాసులు మాత్రమే” అంటూ సమాధానమిస్తోంది. కానీ, టైమ్ టేబుల్, ఫీజు వసూలు, డ్రెస్సు కోడ్ మొదలైనవి చూస్తే, ఇది స్పష్టంగా పాఠశాల తరహా నిర్వహణగా అభివృద్ధి చెందింది.

### U-DISEలో విద్యార్థుల వివరాల నమోదు ఎలా?

గుర్తింపు లేని క్యాంపస్‌లో విద్యార్థులు చదువుతున్నా, ఇతర గుర్తింపు పొందిన క్యాంపస్ కోడ్‌ల ద్వారా U-DISEలో నమోదు చేయడం విద్యా గణాంకాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది సిస్టమ్‌పై నమ్మకాన్ని కలుషితం చేస్తోంది.

### నిరుద్యోగుల డిమాండ్

“ట్యూషన్ అని చెప్పుకుంటే మాకు కూడా అవకాశం ఇవ్వాలి”, అని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రమే ట్యూషన్ పేరుతో తరగతులు నిర్వహించగలవా? అని వారు సవాల్ చేస్తున్నారు.

### తల్లిదండ్రుల్లో గందరగోళం

తమ పిల్లలు చదువుతున్న తరగతులకు గుర్తింపు ఉందా లేదా అనే స్పష్టత లేకపోవడం వల్ల తల్లిదండ్రులు భయంతో ఉన్నారు. పిల్లల భవిష్యత్తు పై మచ్చతలపడకూడదనే ఆందోళన వారిలో పెరిగిపోతోంది.

### విద్యార్థి సంఘాలపై దురుసు ప్రవర్తన

ఈ వ్యవహారంపై ప్రశ్నించిన విద్యార్థి సంఘాల సభ్యులు, స్థానిక జర్నలిస్టులపై పాఠశాల సిబ్బంది దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉంది.

### గుర్తింపు లేని ప్రాంగణం - అక్కడే తరగతులు

వేరే ప్రదేశాల్లో అడ్మిషన్లు తీసుకుని, గుర్తింపు లేని బాన్సువాడ కేంద్రంలో విద్య నిర్వహిస్తున్నామని సిబ్బంది చెబుతుండటం, వ్యవస్థను మోసం చేయడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రభుత్వం స్పందించాలి

విద్యా శాఖ ఈ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి. చిన్న పాఠశాలలు మూసేస్తూ, కార్పొరేట్ సంస్థల వైపు మౌనంగా ఉండటం తార్కికంగా సరైనది కాదు అని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి.న్యాయం కోరుతూ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.

# రేషన్ కార్డు నిరుపేదలకు ఆత్మగౌరవ పత్రం

### రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు.



**ఎల్ బి నగర్ ఆగస్టు1( సమయం న్యూస్).** రేషన్ కార్డు అనేది ఒక పత్రం కాదని, ఆత్మగౌరవ పత్రం అని, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తోందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుఅన్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజక వర్గం కర్మంజ్‌పత్‌లోని కొత్త కాపు యాదవ రెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల జీవితాలను మార్చాలంటే, గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వాలని కూడా అనుకోలేదని అన్నారు. ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా, వివిధ సంక్షేమ పథకాల అమలులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా ప్రతి ఒక్కరికీ 6 కిలోల బియ్యం అందిస్తోందని ఆయన అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ప్రతి ఇంటికి బియ్యం అందించే కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. గత ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో, ప్రాంతాలు మారిన వారి పేర్లను రేషన్ కార్డుల నుండి తొలగించినప్పుడు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ప్రజలు తమ కొడుకులు, కొడుకుల పిల్లలను కూడా రేషన్ కార్డులలో నమోదు చేస్తున్నామని చెబుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రి వివరించారు. ఆరు హామీలకు సంబంధించి ఇప్పటికే ఉచిత బస్సులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మిగిలిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ పురోగతికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటాయించిందని, ఎల్బీ నగర్ నియోజక వర్గంలో మురుగు నీటి వ్యవస్థలు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా 200 కోట్లు కేటాయించిందని వివరించారు.

నగరాన్ని నాలుగు దిశలకూ సులభంగా చేరుకోవడానికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటోందని, మెట్రో రైలుకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంలోని సంబంధిత శాఖ మంత్రిని పదేపదే కోరినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. జిల్లా కేంద్రాలకు సులభంగా, సురక్షితంగా చేరుకోవడానికి ఔటర్ రింగ్ రోడ్డు నుండి ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రెండేళ్లలో పూర్తి చేయబోతున్నామని మంత్రి వివరించారు. కాంగ్రెస్ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం జంట నగరాలకు కృష్ణా, మంజీరా నదుల నుండి నీటిని తీసుకు వచ్చిందని, పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క చుక్క నీటిని కూడా తీసుకురాలేదని ఆయన అన్నారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో తీసుకురావడానికి ప్రస్తుతం కొత్త ప్రాజెక్టును చేపడతామని మంత్రి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపు 65 వేల ఉద్యోగాలు సృష్టించామని, దీనితోపాటు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకు వస్తున్నామని చెప్పారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే మరో వైపు అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. అనంతరం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పట్నం మహేందర్రెడ్డి, దయానంద్ గుప్తా, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఆర్డీఓ రాజేశ్వర్రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పారిజాత, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ జలకళ: 26 గేట్ల ఎత్తివేత

**నల్గొండ, ఆగస్ట్ 1(సమయం న్యూస్)** నాగార్జునసాగర్ జలాశయం భారీ వరద ప్రవాహంతో నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి ఉధృతి కారణంగా ప్రాజెక్టు అధికారులు 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,65,080 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. హిల్ కాలనీలోని లాంచీ స్టేషన్, పైలాన్ కాలనీలోని కొత్త బ్రిడ్జి, పాత వంతెన, డ్యామ్ ఎంట్రన్స్ వద్ద సందర్శకుల సందడి నెలకొంది. రాబోయే రెండు రోజులు సెలవు దినాలు కావడంతో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే మూడు నాలుగు రోజుల వరకు గేట్లు తెరిచే ఉంచే అవకాశం ఉందని తెలుస్తోంది. సందర్శకుల రద్దీని నిర్వహించేందుకు సిబ్బంది పార్కింగ్ వసతులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 585.40 అడుగుల వద్ద ఉంది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 302.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ సందర్భంగా, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, “18 సంవత్సరాల తర్వాత జులై నెలలోనే 26 గేట్లు ఎత్తడం సంతోషకరం. నాగార్జునసాగర్ ఆధునిక దేవాలయం లాంటిది, ఇది 26 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది” అని అన్నారు. పర్యాటకులు సురక్షితంగా సందర్శించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది, ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతోంది.





# 224 పరుగులకు ఆలౌటైన టీమిండియా

## అర్ధ సెంచరీతో ఆడుకున్న కరుణ్ నాయర్.. 5/33తో రాణించిన గస్ అట్కిన్సన్

ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఆఖరిదైన ఐదో టెస్టులో టీమిండియా ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. సవాలు విసిరే ఈ పిచ్ పై శుక్రవారం రెండో రోజు ఆట ప్రారంభమైన కాసేపటికే తొలి ఇన్నింగ్స్ లో 69.4 ఓవర్లలో 224పరుగులకు ఆలౌటైంది. వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ అర్ధ సెంచరీ (109 బంతుల్లో 57, 8 ఫోర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇంగ్లీష్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ ఫైఫర్ (5/33)తో సత్తా చాటాడు. ఈ మ్యాచ్ లోనే చోటులో దక్కించుకున్న కరుణ్.. జట్టులో ఏకైక ఫిఫ్టీతో తన స్థానానికి న్యాయం చేశాడు. మరోవైపు ఈ మ్యాచ్ కు గాయం కారణంగా క్రిస్ వోక్స్ దూరమయ్యాడు. టెయిలెండర్లు త్వరగా ఔటయ్యే బలహీనతను టీమిండియా మరోసారి ప్రదర్శించింది. శుక్రవారం రెండోరోజు ఉదయం 204/6 తో తొలి ఇన్నింగ్స్ ను కొనసాగించిన భారత్ మరో 20 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లను కోల్పోయింది. 218 పరుగుల వద్ద కరుణ్ ను జోష్ టంగ్ ఎల్బీగా ఔట్ చేశాడు. ఆ తర్వాత గస్ అట్కిన్సన్ త్వరగా మూడు వికెట్లను తీసి, ఫైఫర్ ను నమోదు చేశాడు. వరుసగా వాషింగ్టన్ సుందర్ (26), మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణలను డకౌట్ చేశాడు. దీంతో ఓ మాదిరి స్కోరుకే టీమిండియా పరిమితమైంది. ఈ వికెట్ పై 280 పరుగుల యావరేజీ స్కోరు కాగా, టీమిండియా ఆ మార్కును దాటలేక పోయింది. ఇక ఈ మ్యాచ్ లో బౌలింగ్ లైనప్ లో ముగ్గురు పేసర్లతోనే బరిలోకి దిగింది. మహ్మద్ సిరాజ్ వరుసగా సిరీస్ లో ఐదో టెస్టు ఆడుతుండగా, ప్రసిధ్, ఆకాశ్ దీప్ రీ ఎంట్రీ ఇచ్చారు. కేవలం ముగ్గురు పేసర్లతోనే బరిలోకి దిగుతుండటంతో వీలైనంత త్వరగా వికెట్లను తీయాలని విశ్లేషకులు



సూచిస్తున్నారు. ఇక ఈ మ్యాచ్ లో ఇరుజట్లు నాలుగేసి మార్పులతో బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్, శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్, జస్ ప్రీత్ బుమ్రా ల స్తానాల్లో ధ్రువ్ జురెల్, కరుణ్ నాయర్, ప్రసిధ్, ఆకాశ్ దీప్ బరిలోకి దిగుతున్నారు. ఇక ఇంగ్లాండ్ జట్టులో కెప్టెన్ బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, బ్రైడెన్ కార్స్, లియామ్ డాసన్ లు ఈ మ్యాచ్ కు దూరమయ్యారు. వారి స్థానాల్లో జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, జామీ ఒవర్టన్ లు జట్టులోకి వచ్చారు. ఇక ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో 2-1తో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.




## బుమ్రాపై బీసీసీఐ సీరియస్?

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్ పర్యటనలో జస్‌ప్రీత్ బుమ్రా మూడు టెస్ట్‌లు మాత్రమే ఆడిన విషయం తెలిసిందే. ఓవల్ వేదికగా గురువారం ప్రారంభమైన ఆఖరి టెస్ట్ మ్యాచ్‌కు బుమ్రా దూరంగా ఉన్నాడు. వర్క్‌లోడ్‌లో భాగంగానే అతన్ని టీమిండియా మేనేజ్‌మెంట్ దూరంగా ఉంచింది. అయితే బుమ్రాకు రెస్ట్ ఇవ్వడాన్ని మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. అన్ని మ్యాచ్‌లు ఆడలేనప్పుడు సిరీస్‌లకు ఎంపిక చేయడం ఎందుకని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే బుమ్రా విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటేనే బుమ్రాను జట్టులోకి తీసుకోవాలని సెలెక్టర్లకు సూచించినట్లు వార్తలు వస్తున్నాయి.'స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్‌లు ఎప్పటికప్పుడు ఆటగాళ్ల వర్క్‌లోడ్‌పై అధ్యయనం చేస్తూనే ఉంటారు. బుమ్రా ఫిట్‌గా ఉండటం జట్టుకు కీలకం. వైద్య బృందం పర్యవేక్షించిన తర్వాతే అతన్ని తుది జట్టులో ఆడించడం జరుగుతుంది. అతను అన్ని మ్యాచ్‌లు ఆడగలడని భావిస్తేనే ఏదైనా సిరీస్‌కు ఎంపిక చేయాలనే ఆలోచనలో బీసీసీఐ, సెలెక్షన్ కమిటీ ఉంది.'అని ఓ బీసీసీఐ అధికారి చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది.అయితే ఈ వార్తలను టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ఖండించాడు. ఇందులో నిజం లేదని చెప్పాడు. 'బుమ్రాపై వస్తున్నవన్నీ తప్పుడు వార్తలే. అతన్ని అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడించాలని అనుకుంటాం. కానీ అతని శరీరం సహకరించాలి కదా? అతని శరీరానికి గౌరవం ఇవ్వాలి. అందుకే బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను జాగ్రత్తగా పరీక్షిస్తున్నాం. ఇష్టానుసారం ఆడుతానని బుమ్రా ఎప్పుడూ చెప్పలేదు. ఇలాంటి కామెంట్స్ రావడం బాధాకరం. మూడు టెస్ట్‌లు మాత్రమే ఆడుతానని సిరీస్‌కు ముందే చెప్పాడు. ఆ మ్యాచ్‌లు ఏంటో మేనేజ్‌మెంటే నిర్ణయించాలన్నాడు. పరిస్థితులకు అనుగుణంగా మేం నిర్ణయాలు తీసుకున్నాం.'అని డస్కాటే పేర్కొన్నాడు.జస్‌ప్రీత్ బుమ్రా సుదీర్ఘ కాలంగా వెన్ను గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అతని విలక్షణమైన బౌలింగ్ శైలి కారణంగా వెన్నుపై అదనపు భారం పడుతోంది. గతేడాది టీ20 ప్రపంచకప్ ముందు జట్టుకు దూరమైన బుమ్రా.. న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బరిలోకి దిగాడు. ఈ పర్యటనలో కెప్టెన్‌గా జట్టు బౌలింగ్ భారాన్ని ఒక్కడే మోసాడు. ఆ సిరీస్ ఆఖరి మ్యాచ్‌లో గాయపడిన అతను ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఆడలేదు. మళ్లీ ఐపీఎల్‌తోనే రీఎంట్రీ ఇచ్చాడు. నాలుగో టెస్ట్‌లో బుమ్రా పేస్ దారుణంగా పడిపోయింది. చీల మండ గాయంతో కూడా అతను ఇబ్బంది పడ్డాడు. ఈ క్రమంలోనే అతను ఆఖరి మ్యాచ్‌కు దూరమయ్యాడు.

## వరుసగా విఫలమౌతున్న జైస్వాల్

తన తొలి ఆస్ట్రేలియా పర్యటనలో యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. అలాంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ పర్యటనలో కూడా యువ భారత ఓపెనర్ నుంచి ఇలాంటి ప్రదర్శన ఆశించారు. దీనికి తోడు, జైస్వాల్ కూడా ఇలాంటి ఆరంభాన్ని పొంది మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీ సాధించాడు. కానీ ఆ తర్వాత, అతని ప్రదర్శన ప్రత్యేకంగా ఏం లేదు. ఇప్పుడు, జైస్వాల్ ఓవల్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కూడా సింగిల్ డిజిట్‌కే అలసిపోయాడు. ఈ విధంగా, ఈ సిరీస్‌లో ఆరోసారి, అతను 50 కంటే తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. కానీ, అతను 7వ సారి కూడా అదే విధంగా ఔట్ కావడం జట్టు ఆందోళనలను పెంచింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో చివరి మ్యాచ్ జులై 31న ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లోనూ టాస్ ఓడిన టీం ఇండియా ముందుగా బ్యాటింగ్ ప్రారంభించింది. కానీ ఈసారి కూడా టీం ఇండియాకు మంచి ఆరంభం లభించలేదు. నాల్గవ ఓవర్ లో జైస్వాల్ ను గస్ అట్కిన్సన్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి జట్టుకు తొలి షాక్ ఇచ్చాడు. ఈ ఇన్నింగ్స్ లో జైస్వాల్ మరోసారి టీం ఇండియాకు భారీ ఆరంభం ఇవ్వలేకపోయాడు. ఎందుకంటే, అతను కేవలం 2 పరుగులకే ఔటయ్యాడు.ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ సెంచరీ చేశాడు. తర్వాతి మ్యాచ్‌లో కూడా జైస్వాల్ ఇలాంటి ప్రదర్శన చేస్తాడని ఊహించారు. కానీ, తర్వాతి 8 వరుస ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ బ్యాటింగ్‌తో కేవలం 2 అర్ధ సెంచరీలు మాత్రమే చేశాడు. 4 సార్లు సింగిల్ ఫిగర్‌కు అవుట్ అయ్యాడు. వీటిలో, జైస్వాల్ 2 సార్లు తన ఖాతాను కూడా తెరవలేకపోయాడు. మెుత్తం మీద, ఈ సిరీస్‌లో అతని స్కోర్లు వరుసగా 101, 4, 87, 28, 13, 0, 58, 0, 2గా ఉన్నాయి.తక్కువ స్కోరు మాత్రమే కాకుండా, ఈ సిరీస్‌లో జైస్వాల్‌ను ఔట్ చేసిన విధానం కూడా ప్రశ్నలను లేవనెత్తింది. వాస్తవానికి, జైస్వాల్ ఈ సిరీస్‌లోని 9 ఇన్నింగ్స్‌లలోనూ వికెట్ సమర్పించుకున్నాడు. వాటిలో 7 ఇన్నింగ్స్‌లలో అతను అదే లోపానికి బలి అయ్యాడు. నిజానికి, కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అయిన



జైస్వాల్, వికెట్ చుట్టూ తిరిగినప్పుడల్లా LBW లేదా స్లిప్‌లో క్యాచ్ అయ్యాడు. దీని అర్థం జైస్వాల్ బలహీనత ఇంగ్లాండ్‌లో బాగా తెలిసింది. అందువల్ల, రాబోయే రోజుల్లో ఈ లోపాన్ని సరిదిద్దడం జైస్వాల్‌కు సవాలుగా ఉంటుంది.

## శుభ్‌మన్ గిల్ ఆల్‌టైమ్ రికార్డ్




లండన్ ఓవల్ టెస్టులో టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్?లో తొలి మ్యాచ్ నుంచి ఫుల్ ఫామ్‌లో ఉన్న గిల్ తాజాగా ఐదో టెస్టులో 46ఏళ్ల రికార్డును బ్రేక్ చేశాడు. ఐదో టెస్టు తొలి రోజు మ్యాచ్‌లో గిల్ లంచ్ బ్రేక్ సమయానికి (15) పరుగులు చేశాడు. దీంతో ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు బాదిన భారత కెప్టెన్‌గా గిల్ రికార్డుల్లోకెక్కాడు. ఈ క్రమంలోనే మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ రికార్డ్ బ్రేక్ చేశాడు. ప్రస్తుతం గిల్ ఈ సిరీస్?లో 743 పరుగులు చేశాడు. గతంలో ఈ లిస్ట్?లో సునీల్ గావస్కర్ 732 పరుగులతో టాప్?లో ఉన్నాడు. 1978-79లో వెస్టిండీస్‌పై గావస్కర్ ఈ స్కోర్ సాధించాడు. దీంతో దాదాపు 46ఏళ్లుగా గావస్కర్ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన కెప్టెన్‌గా కొనసాగుతూ వచ్చాడు. తాజా సిరీస్‌లో గిల్ ఈ రికార్డును బ్రేక్ చేశాడు. కాగా, ఈ సిరీస్?లో గిల్ ఇప్పటికే 743 పరుగులు చేశాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 92.88 సగటుతో గిల్ ఈ గణాంకాలు నమోదు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. అలాగే ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గానూ గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు బాదిన టీమ్‌ఇండియా ప్లేయర్లలో గావస్కర్ 774 పరుగులతో టాప్‌లో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లోనే గిల్ ఈ రికార్డు కూడా బ్రేక్ చేసే ఛాన్స్ ఉంది. టెస్టు హిస్టరీలో సింగిల్ సిరీస్‌లో ఓ ప్లేయర్ బాదిన అత్యధిక పరుగులు 974. ఆస్ట్రేలియా లెజెండరీ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మన్ 1930లో యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌పై 974 పరుగులు చేశాడు. అలాగే ఈ సిరీస్‌లో బ్రాడ్‌మన్ మొత్తం 4 సెంచరీలు సాధించాడు. గత 95 ఏళ్ల నుంచి టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు నమోదు చేసిన రికార్డ్ బ్రాడ్‌మన్ పేరిటే కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుత సిరీస్?లో ఈ రికార్డ్ బ్రేక్ చేసేందుకు గిల్‌కు ఛాన్స్ ఉంది.ఈ సిరీస్?లో ఇప్పటిదాకా గిల్ 743లి పరుగులు చేశాడు. మరో 231 పరుగులు చేస్తే, గిల్ వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన బ్యాటర్ అవుతాడు. ఈ మ్యాచ్‌లో ఇంకో రెండు ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. రెండో ఇన్నింగ్స్?ల్లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడితేనే గిల్?కు ఆ ఘనత సాధించే ఛాన్స్ ఉంది. మరి గిల్ ఏం చేస్తాడో చూడాలి!ప్రస్తుత సిరీస్?లో గిల్ శతకాల మోత మోగిస్తున్నాడు. ఇటీవల మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్?లో సెంచరీతో రాణించారు. ఈ సిరీస్?లో గిల్?కు అది నాలుగో శతకం. తొలి టెస్టులో శతకం బాదగా, ఎడ్జ్?బాస్టన్ టెస్టులో (269 పరుగులు, 161 పరుగులు) రెండు సెంచరీలు నమోదు చేశాడు. దీంతో క్రికెట్ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌లో అత్యధిక సెంచరీలు బాదిన కెప్టెన్‌గా దిగ్గజాలు సునీల్ గావస్కర్, డాన్ బ్రాడ్‌మన్ మన్ రికార్డును సమం చేశాడు.




## కోహ్లీ బాత్రూమ్‌లో ఏడవడం చూశా

### వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ బాత్రూమ్‌లో ఏడవడం చూశానని వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తెలిపాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఓటమి కోహ్లీ తట్టుకోలేకపోయాడని గుర్తు చేసుకున్నాడు. కోహ్లీతో పాటు జట్టులోని ఆటగాళ్లంతా కన్నీటి పర్యంతమయ్యారని చెప్పాడు. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ఈ ప్రపంచకప్‌లో అసాధారణ ప్రదర్శనతో సెమీస్ చేరిన భారత్.. తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్ రెండు రోజుల పాటు జరగ్గా.. టీమిండియా గెలుపు కోసం జడేజా, ధోనీ ఆఖరి వరకు పోరాడారు. కానీ చివర్లో ధోనీ రనౌట్‌గా వెనుదిరిగడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. ఆ పరాజయాన్ని భారత అభిమానులు కూడా జీర్ణించుకోలేకపోయారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చాహల్.. ఈ మ్యాచ్‌ను గుర్తు చేసుకున్నాడు. '2019 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఓటమి తట్టుకోలేక కోహ్లీ కన్నీటి పర్యంతమయ్యాడు. అతనే కాదు జట్టులోని ఆటగాళ్లంతా ఏడ్చారు. నేనే చివరిగా క్రీజులో నుంచి వచ్చా. కోహ్లీని దాటి ముందుకెళ్తుంటే అప్పటికే అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. ధోనీకి అదే ఆఖరి మ్యాచ్. ఆ క్షణమే బౌలింగ్‌లో నేను 15 పరుగులు తక్కువగా ఇవ్వాల్సిందని అనిపించింది. నేను ఇంకొంచెం ఉత్తమంగా బౌలింగ్ చేసి ఉంటే బాగుండేదనిపించింది.'అని చాహల్ పేర్కొన్నాడు. ఆ మ్యాచ్‌లో చాహల్ 10 ఓవర్లో 63 పరుగులిచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీసాడు. ఈ ఓటమి కారణంగా విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఒక్క ఐసీసీ టైటిల్‌ను అందించలేకపోయాడు. అతని సారథ్యంలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేసింది. అతని సారథ్యంలో టీమిండియా 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ చేరడం, 2019 వన్డే ప్రపంచకప్ సెమీస్, డబ్ల్యూటీసీ 2021 ఫైనల్ చేరింది. కానీ తృటిలో టైటిల్ అందుకోలేకపోయింది. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.

# ఉత్తమ చిత్రం భగవంత్ కేసరి

## 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటన

**హైదరాబాద్ :** ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించింది. డైరెక్టరేట్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ అవార్డులు, భారతీయ సినిమా రంగంలో విశేష కృషిచేసిన చిత్రాలకు, కళాకారులకు రాష్ట్రపతి చేతుల మీదుగా అందించనున్నారు. 2023 సంవత్సరానికి గాను 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతల వివరాలను కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్ మురుగన్‌కు జ్యూరీకి అందజేశారు. 2023 సంవత్సరంలో రూపొందిన సినిమాల సృజనాత్మకత, వైవిధ్యం, సాంస్కృతిక అంశాల ప్రాముఖ్యత ఆధారంగా జ్యూరీ ఈ అవార్డులను ప్రకటించింది. ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం, బాలల చిత్రం వంటి అనేక విభాగాల్లో అవార్డులు ఖరారయ్యాయి. జాతీయ ఉత్తమ చలన చిత్రంగా టువెల్త్‌ఫెయిల్ అనే చిత్రానికి అవార్డు దక్కింది. ఇద్దరికి జాతీయ ఉత్తమ నటుడి అవార్డు వరించింది. షారూఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే( టువెల్త్ ఫెయిల్) ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ)లో రాణీ ముఖర్జీకి అవార్డు దక్కింది. ఉత్తమ దర్శకత్వంలో ది కేరళ స్టోరీ (హిందీ) సుదీప్తో సేన్ ని అనౌన్స్ చేశారు. ఈ ఏడాది కొన్ని భాషా చిత్రాలు, ప్రాంతీయ సినిమాలు సైతం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడం విశేషం. నూతన దర్శకుల ప్రతిభకు గుర్తింపు లభించడంతో పాటు, అనుభవజ్ఞుల కృషికి గౌరవం దక్కింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలకు పురస్కారాలను అందజేయనున్నారు. 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ "భగవంత్ కేసరి" కి అవార్డు దక్కగా, హనుమాన్ మూవీకి బెస్ట్ స్టంట్ కోరియోగ్రఫీ నేషనల్ అవార్డు దక్కింది. చిత్రానికి బెస్ట్ యాక్షన్ డైరెక్టర్స్ గా నందు, పృథ్వీ పని చేశారు. ఇక బలగం సినిమాలోని "ఊరు పల్లెటూరు" సాంగ్‌కు నేషనల్ అవార్డు దక్కింది. ఈ గీత రచయిత కాసర్ల శ్యామ్ అవార్డ్ అందుకోనున్నారు. ఉత్తమ్ స్క్రీన్ ప్లే %–% బేబీ (సాయి రాజేష్ నీలం (షేరింగ్), బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్– బేబీ (పివి ఎన్ఎస్ రోహిత్), బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా సుకృతి వేణి (సుకుమార్ కుమార్తె) %–% గాంధీ తాత చెట్టు, ఉత్తమ చిత్రం యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్ గేమింగ్ కామిక్ – హనుమాన్ లని జ్యూరీ సభ్యులు అనౌన్స్ చేశారు.

**మంత్రి కోమటిరెడ్డి హర్షం**

71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు ఏడు అవార్డులు లభించడం పట్ల తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందులో ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి ఎంపిక కావడం, తెలంగాణలోని పల్లె ఆప్యాయతను కళ్లకు కట్టినట్లు చూపిన బలగం సినిమాలోని పాటలకు కాసర్ల శ్యామ్ కు జాతీయ అవార్డు లభించడం పట్ల మంత్రి వారికి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినీ రంగాన్ని నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. అవార్డులు వరించిన చిత్రాలకు,ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, అవార్డు వచ్చేలా సమష్టి కృషి చేసిన వారి బృందం మొత్తానికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.






## చకచకా పెద్ది మూవీ షూటింగ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తో పాటు ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు–డు శివరాజ్ కుమార్‌తోపాటు–, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.




## కింగ్డమ్ పార్ట్ -2 పై అప్పడే ప్రకటన


విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్ట్ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్–టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.



## బీచ్‌లో ప్రియాంక చోప్రా లుక్ వైరల్

బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించిన ప్రియాంక చోప్రా గత కొన్ని సంవత్సరాలుగా హాలీవుడ్‌లో వరుస సినిమాలు, సిరీస్‌లు చేస్తున్న విషయం తెల్సిందే. హాలీవుడ్ హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా ఆఫర్లు దక్కించుకుంటూ, పారితోషికం అందుకుంటున్న ప్రియాంక చోప్రాను అభిమానులు గ్లోబల్ బ్యూటీ అంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు. పేరుకు తగ్గట్లుగానే ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా మొత్తం గ్లోబ్‌లో ఉన్న దేశాలన్నింటిలోనూ గుర్తింపు దక్కించుకుంది. తక్కువ సమయంలోనే హాలీవుడ్‌లో ఎన్నో ప్రాజెక్ట్‌లను చేయడం ద్వారా అక్కడ కూడా టాప్ స్టార్‌గా గుర్తింపు దక్కించుకుంది. కమర్షియల్ సినిమాలతో పాటు నటనకు ఆస్కారం ఉన్న సినిమాలు, సిరీస్‌లు చేయడం ద్వారా ప్రియాంక చోప్రా మంచి గుర్తింపు దక్కించుకుంది. తాజాగా మరోసారి ప్రియాంక చోప్రా బర్త్‌డే కి సంబంధించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. ఈసారి భర్త నిక్‌తో పాటు కూతురు మాల్తీ ఉన్న ఫోటోను పీసీ షేర్ చేయడం ద్వారా మరింతగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మొదటి నుంచి ప్రియాంక చోప్రా తన కూతురు పోటోలను హైడ్ చేస్తూ వస్తుంది. ఇప్పుడు కూడా మాల్తీ కిందకు చూస్తున్న ఫోటోను మాత్రమే పీసీ షేర్ చేయడం ద్వారా అభిమానులను నిరుత్సాహంకు గురి చేసింది. నిక్ సింగిల్ షార్ట్ మీద ఉ ండగా, ప్రియాంక గ్రీన్ కలర్ బికినీ ధరించి ఉంది. స్టైలిష్ గాగుల్స్‌ను ధరించడం ద్వారా వీరిద్దరూ కట్టిపడేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు, వీరిద్దరి జోడీ భలే ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## అందాల ప్రణీత స్టైలిష్ షో



కన్నడ మూవీ 'పోర్కి'తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ప్రణీత సుభాష్ టాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించిన విషయం తెల్సిందే. 2010లో 'ఏమ్ పిల్లో ఏమ్ పిల్లాడో' సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. ఆ సినిమా కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సొంతం చేసుకోలేదు. అయినా కూడా బావా సినిమాలో ఆఫర్ దక్కించుకుంది. తెలుగులో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసిన ప్రణీత తమిళ్‌లో ఉదయన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. కన్నడం, తెలుగు, తమిళ్ భాషల్లో వరుస సినిమాలు చేసిన ప్రణీత సుభాష్ సౌత్ ఇండియాలో మంచి పేరు దక్కించుకుంది. పవన్ కళ్యాణ్‌తో నటించిన 'అత్తారింటికి దారేది' సినిమాతో టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా ప్రణీత నిలిచింది. తన సినిమాలతో పాటు సేవా కార్యక్రమాల కారణంగా ప్రణీత వార్తల్లో నిలుస్తూ ఉంది. ప్రణీత సినిమాలతోనే కాకుండా రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్న విషయం తెల్సిందే. వయసు పెరుగుతున్నా, తల్లి అయినా కూడా ప్రణీత చాలా అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉ ంటారు. తాజాగా మ–రోసారి ప్రణీత అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ కలర్ షర్ట్ వేసుకున్న ప్రణీత పై బటన్ తొలగించి మరీ క్లీ వేజ్ షో చేస్తూ కవ్విస్తోంది. ఈ స్టైలిష్ అందాల ఆరబోత ఫోటోలకి నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందం తో పాటు ప్రణీత కళ్లలో మెరుపు కనిపిస్తుందని అంటున్నారు.

## ఆసక్తికరంగా వచ్చివన వాడు గౌతమ్ టీజర్

యంగ్ హీరో అశ్విన్ బాబు చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ సినిమా మీద ఆసక్తి ఏర్పరిచింది. ఈ సినిమాకి మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ సినిమాని నిర్మాత టి.గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో – ప్రొడ్యూసర్. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇం–టె–న్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇటీవలే భారీ బడ్జెట్ తో హైవోల్టేజ్ –ల్గ÷కె–మాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు. హై టెక్నాలజీని వాడి ఈ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేశారు. రియా సుమన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్,÷ం గణేష్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎన్. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ, గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**